
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 15 జూలై 2025

సుదీర్ఘ నిరీక్షణ.. ఫలించిన వేళ

సుదీర్ఘ నిరీక్షణ ఫలిస్తోంది.. లబ్ధిదారుల్లో ఆనందం తొణికిసలాడుతోంది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న రేషన్ కార్డులు చేతికొచ్చే సమయం ఆసన్నమవడంతో దరఖాస్తు దారులు హర్షం వ్యక్తం చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన కార్యక్రమం ద్వారా కొత్త కార్డుల కోసం, కుటుంబసభ్యుల పేర్ల మార్పులు, చేర్పులకు, వివాహాలు అయిన వారు కుటుంబం నుంచి కార్డుల విభజనకు దరఖాస్తులు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు లక్ష వరకు దరఖాస్తులు రాగా.. వాటిని పరిశీలించిన అధికారులు ఎట్టకేలకు అర్హులను ఎంపిక చేశారు. త్వరలోనే వాటిని పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

- పంపిణీకి సిద్ధంగా కొత్త రేషన్ కార్డులు
- లబ్ధిదారులకు అందించేందుకు యంత్రాంగం సన్నాహాలు



ఖమ్మం కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల పంపిణీ కోసం అధికారయంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. పదేళ్లకుపైగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాది దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించి అధికారులు అర్హులను ఎంపిక చేశారు. ప్రజాపాలన కార్యక్రమంలో కొత్త కార్డుల కోసం, కుటుంబసభ్యుల పేర్లు చేర్పించడానికి, వివాహాలైన తర్వాత కార్డుల విభజనకు ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో సుమారు లక్ష వరకు అర్జీలు వచ్చాయి. వీటిని పరిశీలించిన అధికారులు ఖమ్మం జిల్లాలో 19,960 కొత్తకార్డులను మంజూరు చేయడంతో పాటు 62,428 మంది పేర్లను పాత కార్డుల్లో చేర్చారు. భద్రాద్రి జిల్లాలో 9,954కొత్త కార్డులను మంజూరు చేశారు. తహసీల్దార్ల దగ్గర పరిశీలనలో మరికొన్ని ఉన్నాయి. ఇవి పూర్తి అయితే మరికొందరికి అవకాశం దక్కనున్నట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారులు తెలిపారు. ప్రజాపాలన, కుటుంబ సర్వేతో పాటు మీ సేవలో దరఖాస్తు చేసుకున్న వాటితో పాటు డీఎస్వో పెండింగ్ అని చూపించిన వాటిని పరిశీలనచేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తి

గ్రామ పంచాయతీ కార్యదర్శులకు క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల గుర్తింపునకు మొబైల్ యాప్ ఇచ్చారు. రెండు నెలల క్రితం దరఖాస్తులను పరిశీలించిన కార్యదర్శులు వాటిని పైస్థాయి అధికారులకు పంపారు. ఇప్పుడు అర్హులైన వారికి కార్డులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ముఖ్యమంత్రి చేతులమీదుగా తుంగతుర్తిలో కొత్త రేషన్ కార్డులను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించగా జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి లబ్ధిదారుల పేరుతో ప్రభుత్వ లేఖలు ముద్రించి పంపించారు. వీటిని త్వరలో ఆయా లబ్ధిదారులకు అందించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

చందన్‌కుమార్, ఖమ్మం డీఎస్వో

ఖమ్మం జిల్లాలో కొత్తగా రేషన్ కార్డులకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. ఇప్పటి వరకు19,960 కొత్త రేషన్ కార్డులు ఇప్పటి వరకు మంజూరయ్యాయి. వీటితో పాటు 62,428 పేర్లను కొత్తగా కార్డుల్లో చేర్చాం. ఇంకా కొన్ని తహసీల్దార్ల పరిశీలనలో ఉన్నాయి. కార్డు మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు పత్రాలను పంపింది.. వాటిని త్వరలోనే లబ్ధిదారులకు అందజేసేందుకు చర్యలు చేపట్టాం.



	ఖమ్మం జిల్లా	భద్రాద్రి జిల్లా
ఇప్పటి వరకు అందిన దరఖాస్తులు :	41,055	42,644
పేర్ల నమోదుకు వచ్చిన అప్లికేషన్లు :	70,483	29.050
గతంలో ఉన్న రేషన్ కార్డులు :	4,15,904	2,97,189
ప్రస్తుతం మంజూరైనవి :	19,960	9,954

రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- గత ప్రభుత్వం వారి సంక్షేమాన్ని విస్మరించింది
- కృష్ణా, గోదావరి జలాలతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి
- పూజలు చేసి.. పాలేరు నుంచి సాగర్ నీరు విడుదల

ఖమ్మం/కూసుమంచి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రైతును రాజును చేయడమే తమ ప్రజా ప్రభుత్వ విధానమని, గత ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించి అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేసిందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి జలాలను సమృద్ధిగా వినియోగించుకుని రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే తమ లక్ష్యమన్నారు. సోమవారం కూసుమంచి మండలం పాలేరు జలాశయం నుంచి జిల్లాలోని సాగర్ రెండోజోన్ ఆయకట్టుకు వారు నీటిని విడుదల చేశారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి కృష్ణా జలాలకు పూజలు చేసిన వారు.. చీర, సారె సమర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ తప్పుల మీద తప్పులు చేసి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. నాడు అధికారంలో ఉన్న (మిగతా 6వ పేజీలో)



స్విచ్చాన్ చేసి పాలేరు జలాశయం నుంచి నీరు విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి



కృష్ణమ్మకు పూలు సారె, చీర సమర్పిస్తున్న భట్టి, పొంగులేటి తదితరులు



ఏపీలో కలిసిన యటపాక గ్రామం



పురుషోత్తపట్నంలోని రామయ్య భూములు

ఆ ఐదే.. అస్త్రాలు!

- ముంపు గ్రామాలపై మారుతున్న పార్టీల స్వరం
- మళ్లీ రాజకీయ నినాదంగా మారుతున్న విలీన సమస్య
- తిరిగి వాటిని తెలంగాణకు ఇవ్వాలంటూ డిమాండ్లు

భద్రాచలం, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ విభజన సమయంలో ఆంధ్రాలో కలిసిన ఆ ఐదు పంచాయతీలపై రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల స్వరం మారుతోంది. పలు పార్టీల నాయకులు వాటినే అస్త్రాలుగా తెరపైకి తెస్తున్నారు. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం పోలవరం ముంపునకు గురయ్యే ఏడు మండలాలను ఏపీలో విలీనం చేయడంతో ప్రధానంగా భద్రాచలం ఏజెన్సీకి తీవ్ర నష్టం వాటిల్లింది. నాడు జిల్లా కేంద్రంగా ఉంటుందని భావించిన భద్రాచలం నేడు గ్రామ పంచాయతీ స్థాయికే పరిమితమైంది. ఇక్కడ ఏ అభివృద్ధి పనులు చేపట్టాలన్నా ప్రభుత్వ స్థలం లేక సాంకేతికపరంగా ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయి. గతంలో ఇదే విషయాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎన్నోసార్లు ప్రస్తావించారు. ఇటీవల కూడా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఆ ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలిపేలా చర్యలు చేపట్టాలని లేఖ అందజేశారు. ఇదే సమయంలో ఇటీవల ఏపీ పరిధిలోని అల్లూరి జిల్లా యటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలోని భద్రాద్రి రామయ్య భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్న సమాచారంతో అక్కడికి వెళ్లిన భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, సిబ్బందిపై దాడి జరగడం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనమైంది. ఈ దాడిని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఖండించడంతో పాటు ఆ పంచాయతీలను తిరిగి తెలంగాణకు ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడికి లేఖ రాశారు. అంతకు ముందు హైదరాబాద్‌లో ఐదు పంచాయతీలపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని కూడా నిర్వహించారు.

రగులుతున్న రామయ్య భూముల వివాదం..

భద్రాచలం సరిహద్దునే ఉన్న పురుషోత్తపట్నంలోని రామయ్యకు చెందిన 889.5 ఎకరాల భూమి ఆక్రమణలో ఉండటంతో వివాదం నిత్యం రగులుతూనే ఉంది. ఈ విషయంపై రాజకీయ పక్షాలు సైతం తమదైన శైలిలో స్పందిస్తున్నాయి. అలాగే విశ్వహిందూ పరిషత్ కూడా భూములను పూర్తిస్థాయిలో పరిరక్షించాలని, అంగుళం భూమి కూడా వదిలేది లేదని ఎంతటి ఉద్యమానికైనా సిద్ధమని వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ పగుడాగుల బాలస్వామి స్పష్టం చేశారు. సీపీఎం సైతం ఐదు పంచాయతీలను తిరిగి భద్రాద్రిలో విలీనం చేయాలని కొంతకాలంగా డిమాండ్ చేస్తూనే ఉంది. ఇదిలా ఉండగా బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి పోలవరంతో భద్రాచలానికి ముంపు పొంచి ఉన్న క్రమంలో భద్రాచలం రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ఐదు పంచాయతీలను (మిగతా 6వ పేజీలో)

మహిళలు ఆర్థికంగా ఎదగాలి..

ఆత్మగౌరవంతో జీవించాలి

- ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం
- రాజకీయాలకతీతంగా పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- ప్రతీ వారం ఇందిరమ్మ ఇళ్ల నిధులు విడుదల 7
- మహిళా శక్తి సంబురాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హాజరైన జిల్లా అధికారులు

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

- భూ భారతి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి
- రెవెన్యూ శాఖపై సమీక్షలో కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు విధినిర్వహణలో అలసత్వం వహించొద్దని, నిత్యం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సోమవారం సాయంత్రం రెవెన్యూశాఖ తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ జిల్లాలోని తహసీల్దార్, ఇతర రెవెన్యూ కార్యాలయాల్లో క్లీన్ వర్కింగ్ ఎన్విరాన్మెంట్ కొనసాగించాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలు పెట్టుకోవాలని, కార్యాలయ ప్రాంగణంలో దళారులకు ఆస్కారం ఇవ్వొద్దని, ప్రజల నుంచి నేరుగా సమస్యలపై దరఖాస్తులు తీసుకుని నిర్దిష్ట సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ వ్యవస్థపై నమ్మకంతో ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని ప్రజలకు విస్తృత సేవలను క్షేత్రస్థాయిలో అందించేలా నిబంధనలను రూపొందించిందన్నారు.ప్రతీ మండలంలో భూభారతి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. మీసేవా ఆపరేటర్లపై తహసీల్దార్ పర్యవేక్షణ పూర్తిస్థాయిలో ఉండాలని, నిర్ణయించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తే లైసెన్స్ రద్దు చేయాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు కూడా సకాలంలో లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. కోర్టు కేసుల్లో స్పష్టమైన కౌంటర్లు దాఖలు చేయాలని, లీగల్ సెల్‌తో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ భూముల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నీటి పారుదల ప్రాజెక్టు, రైల్వేలైన్, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారులు, మున్నేరు రిటైనింగ్ వాల్ అభివృద్ధి పనులపెండింగ్ భూసేకరణ వేగంగా పూర్తి చేయాలన్నారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం కల్పించిందని, పనులు, భూసేకరణ సమాంతరంగా జరగాలన్నారు. భూ భారతి దరఖాస్తుల్లో త్వరితగతిన పరిష్కరించేందుకు అవకాశం ఉన్న వాటికి ప్రాధాన్యమిచ్చి పరిశీలించాలన్నారు.సమావేశంలో డీఆర్వో పద్మశ్రీ, ఎస్డీసీ రాజేశ్వరి, రెవెన్యూ డివిజన్ అధికారులు నర్సింహారావు, రాజేందర్ గౌడ్, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

లాభదాయక మొక్కల పెంపకంతో

కార్పొరేషన్‌కు రూ.310కోట్ల ఆదాయం

- టీఎస్ఎఫ్‌డీసీ వైస్ చైర్‌పర్సన్, ఎండీ సునీత ఎం భగవత్ 6



ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

మాధవి (ఫైల్)

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

- డాబాపై దుస్తులు ఆరేస్తుండగా తగిలిన 11కేవీ వైర్
- అధికారుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబీకుల ఆరోపణ
- సబ్ స్టేషన్‌పై దాడి.. మృతదేహంతో ధర్నా 7
- ఖమ్మంరూరల్ మండలంలో ఘటన
- భర్త ఫిర్యాదుతో విద్యుత్ అధికారులపై కేసు నమోదు

సెర్ప్ పథకాలు పారదర్శకంగా ఉండాలి

- ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసుకోవాలి
- మహిళా సంఘాల్ని మరింతగా ప్రోత్సహించాలి
- జిల్లా సమాఖ్య సమావేశంలో సెర్ప్ సీఈవో దివ్య
- ఖమ్మంలోని మహిళా మార్టు సందర్శన



మహిళా టీ స్టాల్ వద్ద సెర్ప్ సీఈవో, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చే పథకాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా పారదర్శకంగా అమలు చేయాలని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ ఆదేశించారు. సోమవారం ఖమ్మం జిల్లా పర్యాటనకు వచ్చిన ఆమె నగరంలోని మహిళా మార్టును పరిశీలించి.. పలు వస్తువులను కొనుగోలు చేశారు. రాష్ట్రంలోనే ఆదర్శంగా ఖమ్మంలో మహిళా మార్టు ఏర్పాటు చేశారని, మంచిగా నిర్వాహణ చేపట్టాలన్నారు. అక్కడే ఉన్న టీ షాప్‌లో కేఎంసీ కమిషనర్, మెప్మా పీడీ అభిషేక్ అగస్త్య, ఏసీఎల్‌పీ శ్రీజతో కలిసి టీ తాగారు. అనంతరం జిల్లా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సమీక్ష నిర్వహించారు. సీఐఎఫ్ నిధుల వినియోగంలో అవినీతిపై చర్యలు తీసుకోవాలని, నూరుశాతం రీపేమెంట్స్ జరపాలని సూచించారు. సెర్ప్ సాఫ్ట్‌వేర్‌ను కేంద్ర సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానం చేయడం పూర్తయిందని, అందులో భాగంగా లోకోస్ సెంట్రల్ డేటాలో నూరుశాతం విలీనమైన సాఫ్ట్‌వేర్‌లోకి ఆధార్ నెంబర్లు రిజిస్ట్రేషన్ చేయలన్నారు. అలా రిజిస్ట్రేషన్ చేసిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకే ఎన్ఆర్ఎల్ఎం కోడ్ వస్తేనే వడ్డీ లేని రుణాలు, బ్యాంకు లింకేజీలు ఇతర పథకాలు అందుతాయన్నారు. ఆన్‌లైన్ పూర్తి కాకుంటే సంఘాలకు ఎలాంటి పథకాలు అందలేదన్నారు. గతంలో మంజూరు చేసిన కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్(సీఐఎఫ్) అవకతవకలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం జిల్లాలో నూరు శాతం రీపేమెంట్స్ జరపాలని ఆదేశించారు. మహిళా (మిగతా 6వ పేజీలో)

లాభదాయక మొక్కల పెంపకంతో

రాష్ట్ర కార్పొరేషన్‌కు రూ.310కోట్ల ఆదాయం

- టీఎస్‌ఎఫ్‌డీసీ వైస్ చైర్‌పర్సన్, ఎండీ సునీత ఎం భగవత్

సత్తుపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గతేడాది వెదురు, జామాయిల్, జీడిమామిడి, ఎకోటూరిజం ద్వారా రాష్ట్ర కార్పొరేషన్‌కు రూ.310కోట్ల ఆదాయం వచ్చిందని టీఎస్ఎఫ్‌డీసీ వైస్ చైర్‌పర్సన్, ఎండీ సునీత ఎం భగవత్ (ఐఎఫ్ఎస్) అన్నారు. ఫీల్డ్ విజిట్‌లో భాగంగా సోమవారం ఆమె ఆకస్మికంగా సత్తుపల్లిలోని డివిజన్ ఆఫీస్, వెదురు డిపోతోపాటు బాలరాజుగూడెంలోని జామాయిల్ ప్లాంటేషన్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉత్పత్తి, డిమాండ్‌కు అనుగుణంగా లాభదాయకమైన మొక్కల పెంపకమే లక్ష్యంగా రూ.80కోట్ల ఖర్చుతో 1783హెక్టార్లలో కొత్త నర్సరీలను ఏర్పాటు చేయనున్నామన్నారు. కార్పొరేషన్ విస్తరించి ఉన్న ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధి చేస్తామని, ఖమ్మంతోపాటు సత్తుపల్లి నియోజకవర్గంలోని కనిగిరి గుట్టల్లో ఎకో టూరిజం ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామన్నారు. సత్తుపల్లి డిపోలో వెదురుకు చెదలు పట్టినప్పటికి ఆదాయం తగ్గే అవకాశం లేదని, ముక్కలుగా చేసి పరిశ్రమలకు విక్రయిస్తామన్నారు. కార్యక్రమంలో సీజీఎం డీవీ.రెడ్డి, డీఎం బి.గణేష్, పీఎంలు వి.బ్రహ్మచారి, ఎస్.నాగరాజు, డీపీఎం ఎం.సిద్ధార్ధకుమార్, సిబ్బంది ఉన్నారు.



డిపో, డీఎం కార్యాలయాలను సందర్శించిన సునీత ఎం భగవత్

మావోయిస్టులకు

వ్యతిరేకంగా కరపత్రాలు

- 'మావోయిస్టు ఆత్మపరిరక్షణ - ప్రజా ఫ్రంట్' పేరిట వెలుగులోకి..

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్/భద్రాచలం/చర్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో మావోయిస్టులకు వ్యతిరేకంగా పలు ప్రాంతాల్లో మావోయిస్టు ఆత్మ పరిరక్షణ ప్రజా ఫ్రంట్ పేరిట కరపత్రాలు సోమవారం వెలుగులోకి వచ్చాయి. కొత్తగూడెం బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ఉన్న గోడలు, పిల్లర్లకు సుమారు 20 కరపత్రాలు అంటించడం కలకలం రేపింది. ఈ కరపత్రాల్లో తెలంగాణ మ్యాప్‌తో పాటు.. 'సిద్ధాంతం కోసం అడవి పాలైన అన్నలార్లా.. అక్కల్లారా.. మీరు నమ్మిన సిద్ధాంతం సామాన్యునికి ఆశా కిరణం ఎన్నడైంది? మీకు ఎదురైన సవాళ్లు, వాటితో పరిణామాలు విశ్లేషిస్తే మీకు ఆత్మ సంతృప్తిని మిగిల్చిందేంది? ఆత్మ సంతృప్తి లేని ఆత్మగౌరవంతో ముందుకు పోతున్న మీ 40 ఎండ్ల నాటి ఉద్యమ బాట ప్రజాదరణ లేక మోడుబారిన బీడు భూమిలాగా అయింది. మావోయిస్టు అగ్ర నాయకుల్లారా ఇకనైనా మీ కాలం చెల్లిన సిద్ధాంతాన్ని వీడి, కాలానుగుణంగా మారిన ప్రజల జీవన విధానంలో పాత్రులు కండి. అడవిని వీడి ప్రజల్లోకి రండి - ప్రజాస్వామ్య గొంతుక కండి. ఆయుధాలు మనకు వద్దు.. ప్రజామోద మార్గమే ముద్దు. జనజీవన స్రవంతిలోకి వచ్చి మీ మేధస్సును ప్రజల అభివృద్ధికి ఉపయోగించండి' అని ముద్రించి ఉంది.



కొత్తగూడెం రైల్వేస్టేషన్ వద్ద అంటించిన కరపత్రాలు

పేలిన ఐఈడీ.. గాయపడ్డ ముగ్గురు గిరిజనులు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా మద్దేడు అడవుల్లో సోమవారం ఉదయం మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలడంతో ముగ్గురు గిరిజనులు గాయపడ్డారు. మద్దేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని దంగోల్ గ్రామానికి చెందిన కుడియం కవిత, కొర్సా సంతోష్, చిడెం కన్నయ్య ముగ్గురు గిరిజనులు పుట్టగొడుగుల సేకరణ కోసం సమీప అడవిలోకి వెళ్లారు. ఇదే క్రమంలో పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబు పేలింది. దీంతో ఆ ముగ్గురు గాయపడ్డారు. అనంతరం గాయాలతోనే అడవినుంచి గ్రామానికి చేరుకున్నారు. స్థానికులు వెంటనే వారిని బీజాపూర్ జిల్లా వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ ఘటనలో స్థానికులు అడవివైపు వెళ్లాలంటేనే వణుకుతున్నారు.

'సీతారామ' రీ డిజైన్‌తో

జిల్లాకు అన్యాయం

ఇల్లెందు టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా ఆరోపించారు. సోమవారం ఇల్లెందు 21పిట్‌లో సీపీఐ మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు రీడిజైన్ ద్వారా ఇల్లెందు, డోర్నకల్, మహబూబాబాద్, పినపాక నియోజకవర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. డిజైన్లను మార్చడంలో అనేక కుట్రలు జరిగాయని ఆరోపించారు. ఆధునిక భారత నిర్మాణంలో సీపీఐ పాత్ర ఎంతో ఉందని, డిసెంబరు 26న సీపీఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందన్నారు. 44 కార్మిక చట్టాలను 4కోడ్‌లుగా మార్చి బీజేపీ ప్రభుత్వం కార్మికసంఘాలకు అన్యాయం చేయడానికి చూస్తుందని పేర్కొన్నారు. అఖిలపక్షాల ఆధ్వర్యంలో జరిగిన దేశ వ్యాప్త సమ్మెలో 25 కోట్లకు పైగా సంఘటిత, అసంఘటిత కార్మికులు పాల్గొని కార్మిక ఐక్యతను చాటారని హర్షం వెలిబుచ్చారు. బీజేపీ ప్రభుత్వంలో నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ అధికార పార్టీతో కలిసి ఉన్న ప్రజలు ఎదుర్కొనే ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సీపీఐ రాష్ట్ర నాయకులు మిర్యాల రంగయ్య, కే. సారయ్య, జిల్లానాయకులు దేవరకొండ శంకర్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్, సీపీఐ పట్టణ కార్యదర్శి బాసా శ్రీనివాస్, బంధం నాగయ్య, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా

నెల రోజుల్లో బిల్లులు చెల్లించకపోతే

స్కూళ్లకు తాళాలు వేస్తాం..

- మన ఊరు- మన బడి కాంట్రాక్టర్ల అల్టిమేటం
- హైదరాబాద్ విద్యాశాఖ కమిషనరేట్ ఎదుట ధర్నా

ఇల్లెందు, జూలై 14 (ఆంధ్రజ్యోతి):మన ఊరు.. మన బడి పథకంలో భాగంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పనులు చేసిన కాంట్రాక్టర్లు హైదరాబాద్ తరలివెళ్లి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగిన కాంట్రాక్టర్ల ధర్నాలో ఇల్లెందు కాంట్రాక్టర్ల సంఘం నాయకులు పూరుకొండ ధనుంజయ్, పర్రె శ్రీను, కొల్లి సంజీవరెడ్డి, మన్నెం శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన మన ఊరు.. మన బడి కాంట్రాక్టర్లు ఆందోళనలో పాల్గొన్నారు. పనులు పూర్తి చేసి గత రెండేళ్లగా బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ రెండేళ్లగా తిరిగినా బిల్లులు ఇవ్వడం లేదని, లక్షల రూపాయలు అధిక వడ్డీలకు అప్పులు చేసి పనులు చేశామన్నారు. అనేక పర్యాయాలు ప్రభుత్వానికి వివరించినా ఫలితం రాలేదన్నారు. గత్యంతరం లేక హైదరాబాద్ విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించామన్నారు. మరో నెల రోజుల్లో తమ బిల్లులు చెల్లించాలని లేని ఎడల రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలకు తాళాలు వేస్తామని నాయకులు ధనుంజయ్ రెడ్డి, సంజీవరెడ్డి హెచ్చరించారు.



విద్యాశాఖ కమిషనరేట్ ఎదుట ధర్నాలో కాంట్రాక్టర్లు

లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్స విజయవంతం..

వైద్యులను అభినందించిన పీవో

భద్రాచలం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఓ మహిళకు లాప్రోస్కోపిక్ సర్జరీ తొలిసారి నిర్వహించిన సర్జన్ డాక్టర్ వెంకట్‌తో పాటు వైద్యులను భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అభినందించారు. సోమవారం తన చాంబర్‌లో లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించిన వైద్యులను శాలువాలతో ఆయన సత్కరించారు. అనంతరం పీవో మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో నివసించే అమాయక గిరిజనులు సరైన అవగాహన లేక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని, వారిని వైద్య సిబ్బంది గుర్తించి సత్వరవైద్యం అందించాలన్నారు. ప్రస్తుతం వర్షాకాల సీజన్ ప్రారంభమైనందున వ్యాధులు ప్రబలుతున్నాయని అందుకు ఏరియా ఆస్పత్రిలో పని చేసే వైద్యులు 24 గంటలు ఆస్పత్రిలో ఉండి రోగులకు వైద్య సేవలందించాలని, గోదావరి వరదల దృష్ట్యా ముంపు ప్రాంతాల ప్రజలకు అత్యవసర వైద్యసేవలు చేసే సమయంలో ప్రణాళికలు రూపొందించుకొని సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య, ఏరియా ఆస్పత్రి పర్యవేక్షకులు రామకృష్ణ, డాక్టర్ వెంకటరాజు, డాక్టర్ నికిత పాల్గొన్నారు.



వైద్యులను సన్మానించిన పీవో రాహుల్

శ్రీనివాస్ మృతి పార్టీకి తీరనిలోటు

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, టీటీడీ బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి

ఖమ్మంరూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంరూరల్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సానబోయిన శ్రీనివాస్‌గౌడ్ మృతి పార్టీకి తీరనిలోటని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, టీటీడీ బోర్డు మెంబర్ నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. శ్రీనివాస్‌గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన దశదిన కర్మ పల్లెగూడెంలోని ఓ ఫంక్షన్ హాల్లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, టీటీడీ బోర్డు మెంబర్ నన్నూరి నర్సిరెడ్డి హాజరై శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. శ్రీనివాస్ లాంటి నాయకుడిని కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీనివాస్ కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీ అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు కృష్ణమోహన్, హరికృష్ణ, పాలేరు ఇన్‌చార్జ్ కొండబాల కరుణాకర్, కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల అధ్యక్షులు మందపల్లి కోటి, ఆర్కెట్ల కొండల్‌రావు, నామా ప్రసాద్, నాయకులు కొప్పుల నాగేశ్వరరావు, మల్లయ్య, బాలకృష్ణ, మురళి, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు.



శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నర్సిరెడ్డి

రైతును రాజు చేయడమే

ప్రభుత్వ లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

బీఆర్ఎస్.. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంతో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నదులపై ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టులు కడుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదని, నాడు తప్పిదాలు చేసిందే కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు అంటూ మండిపడ్డారు. శ్రీశైలం ప్రాజెక్టు వద్ద రాయలసీమకోసం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం వల్ల నాగార్జునసాగర్ జోన్ 1, 2 ప్రాంతాలు ఇబ్బందులకు గురవుతాయని పదే పదే చెప్పినా.. నిర్లక్ష్యం చేశారని గుర్తుచేశారు. రోజుకు 11 టీఎంసీల నీటిని తరలించేందుకు నిలువ ప్రాజెక్టుల నిర్మాణానికి బీఆర్ఎస్ పెద్దలు సహకరించారని ఆరోపించారు. వాటిని మర్చిపోయి నేడు తమ ప్రజాప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడమేంటని ప్రశ్నించారు. నాటి వారి తప్పిదాలను సరిచేస్తూ ముందుకు పోతున్నామన్నారు. కృష్ణా నదిపై పెండింగ్‌లో ఉన్న కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్, పాలమూరు, రంగారెడ్డి, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులను పూర్తిచేయడంతోపాటు వీలైనంత వరకు కృష్ణాజలాలను వినియోగించుకునేందుకు కృషిచేస్తున్నామన్నారు. అలాగే గోదావరి నదిపై వాటాసాధన, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికోసం చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. కృష్ణా, గోదావరి జలాలను తెలంగాణలో సమృద్ధిగా వాడుకుని సస్యశ్యామలం చేసి తీరుతామన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే వ్యవసాయం, కరెంట్, ప్రాజెక్టులు : పొంగులేటి

రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే వ్యవసాయం, కరెంటు, ప్రాజెక్టులని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రైతులకు ఒకేవిడతలో రూ.21వేలకోట్ల రుణమాఫీ, 9రోజుల్లో రూ.9వేల కోట్ల పెట్టుబడి సాయం, పంపుసెట్లకు రూ.17,500 కోట్లు విద్యుత్ సబ్సిడీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. వరి పంటను ప్రోత్సహిస్తూ సన్నవడ్లకు రూ.500బోనస్ అందించామన్నారు. రైతు సంక్షేమ పథకాలు అమలు ద్వారా రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. రాష్ట్రం అన్నపూర్ణగా, విత్తనభాండాగారంగా తయారైందని పొంగులేటి తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం ఆర్థికంగా విధ్వంసమైనా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధులు సమకూరుస్తూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతున్నామని పేర్కొన్నారు. కాలం కలిసొచ్చి ఈ సారి కృష్ణా ఎగువన ముందుగా వానలొచ్చి నీరు విడుదల చేయగలగుతున్నామని, గతేడాది భారీవర్షాల సమయంలో పాలేరు డ్యాం వద్దపవర్ ప్రాజెక్టుతోపాటు కాలువకు గండి పడిందని, యూటీ నిర్మాణం, కాలువ లైనింగ్ పనులకు రూ.14.55 కోట్లు మంజూరు చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేశామన్నారు. తొలుత 1200 క్యూసెక్కులనీరు విడుదల చేశామని క్రమంగా అవసరాన్ని బట్టి నీటివిడుదలను పెంచుతామన్నారు. ఖమ్మం జిల్లాలో 2.55 లక్షల ఎకరాల్లో పంట్యాలకు నీరందుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ మాజీవైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నీటిపారుదల శాఖ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ ఎస్ఈ యాఖుబ్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆ ఐదే.. అస్త్రాలు!

(5వ పేజీ తరువాయి)

తిరిగి భద్రాద్రిలో విలీనం చేయాలని ఇప్పటికే పలుమార్లు డిమాండ్ చేశారు. అంతే కాదు ప్రధాని, కేంద్ర మంత్రులకు వినతి పత్రాలను కూడా సమర్పించారు.

ఆ పంచాయతీల కోసం నిరసనలు, పోరాటాలు

ఏపీలో విలీనమైన ఆ ఐదు పంచాయతీలను తిరిగి భద్రాద్రిలో విలీనం చేయాలంటూ కొన్నేళ్లుగా ఎన్నో నిరసనలు, పోరాటాలు సాగాయి. వివిధ రాజకీయపక్షాలు ఇందులో పాల్గొని మద్దతు తెలిపాయి. అంతేకాదు భద్రాద్రికి సరిహద్దున ఉన్న ఏపీలోని యటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం, గుండాల పంచాయతీ సర్పంచ్‌ల తీర్మానాలు, సర్పంచ్‌లతో గతంలోనే గవర్నరుకు అప్పటి భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య నివేదించారు. 2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా కేంద్రంలో తాము అధికారంలోకి వస్తే ఐదు పంచాయతీలను తప్పక తెలంగాణలో కలుపుతామని కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలోనే పొందుపరిచింది. భద్రాచలం ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కూడా ఐదు పంచాయతీలను భద్రాద్రిలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సరిహద్దు ప్రాంతానికి చెందిన వారు సైతం తాము ఎదుర్కొంటున్న కష్టాలకు పరిష్కారం భద్రాద్రిలో విలీనంతోనే సాధ్యమని పలుమార్లు స్పష్టం చేశారు.

రాజకీయ అస్త్రంగా ఆ ఐదు పంచాయతీలు..

ఐదు పంచాయతీల సమస్య పరిష్కారం కోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని అసెంబ్లీలో తీర్మానం చేసి అఖిలపక్షాన్ని కేంద్రంలోని ప్రధాని, రాష్ట్రపతి వద్దకు తీసుకెళ్తానని కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తొలి సారి సీఎం అయిన సమయంలో అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి మరిచిన విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తు చేస్తున్నారు. నాడు తెలుగు రాష్ట్రాల్లో పరస్పర అవగాహన ప్రభుత్వాలు ఉండటంతో తప్పక ఏజెన్సీవాసుల ఆశలు సాకారమవుతాయని అందరూ భావించారు. కానీ అనంతరం ఈ విషయమై ముందడుగు పడలేదని రాజకీయ పక్షాలు విమర్శిస్తున్నాయి. గత దశాబ్ద కాలంలో అప్పటి ప్రభుత్వం ఈ విషయాన్ని విస్మరించిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ రోజు ప్రతిపక్ష స్థానంలో ఉండటంతో ఐదు పంచాయతీల అంశం తెరపైకి తెస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఈ ప్రాంత ప్రజలు ఐదు పంచాయతీలు భద్రాద్రిలో కలవాలని ముక్తకంఠంతో కోరుకుంటుండగా రాజకీయపక్షాలు రాజకీయ అస్త్రంగా కాకుండా ఐదు పంచాయతీలకోసం అంకితభావంతో కృషి చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

అవసరమైతే ఎంతటి ఉద్యమానికైనా తాము సిద్ధమని పార్టీల కతీతంగా నాయకులు ఐక్యంగా ఐదు పంచాయతీల సాధన కోసం చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, భద్రాద్రికి సరిహద్దున ఉన్న ఏపీలోని పంచాయతీలకు చెందిన వారు పేర్కొంటున్నారు.

ఈసారి రెండు తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలకు పరస్పర అవగాహన ఉన్న వారవడంతో ఈసారైనా తమ ఆశ చిగురిస్తుందని భావించిన వారికి ఇంకా అది సాకరం కాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. మరో వైపు అయోధ్యకు ఎంతో ప్రాధాన్యమిచ్చిన కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దక్షిణ అయోధ్యపై ఎందుకు వివక్ష చూపుతోందనే విమర్శలు రాజకీయపక్షాల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా సరిహద్దు ప్రాంతాలకు చెందిన వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను గుర్తించి ప్రస్తుతం తెరపైకి వచ్చిన ఐదు పంచాయతీల అంశం పరిష్కారం దిశగా అడుగులు వేయాలని ఈ ప్రాంతవాసులు ఆకాంక్షిస్తున్నారు.

సెర్ప్ పథకాలు పారదర్శకంగా ఉండాలి

(5వ పేజీ తరువాయి)

స్వయం సహాయక సంఘాల్ని మరింతగా ప్రోత్సహించాలని, ప్రతీ గ్రామంలో ఒక కిషోర బాలిక ఎస్‌హెచ్‌జీ, దివ్యాంగుల ఎస్‌హెచ్‌జీ, వృద్ధాప్య ఎస్‌హెచ్‌జీ ఏర్పాటు చేయాలన్నారు. దేశంలో 700జిల్లాలో సెర్ప్ పథకాలు అమలు జరుగుతుంటే వాటిలో పది జిల్లాలను డిజిటల్ చెల్లింపుల పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేస్తే ఖమ్మం జిల్లాకు స్థానం దక్కిందన్నారు. రోజూ డీపీఎంలో సాయంత్రం సమావేశాలు నిర్వహించి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. మహిళలకు డ్రైవింగ్ నుంచి అన్ని రంగాల్లో శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా మహిళా మార్టులో మెప్మా ఉత్పత్తుల గురించి తెలుసుకున్న ఆమె చెక్క బొమ్మలు బాగున్నాయని కితాబునిచ్చారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో మహిళా మార్టులను ఏర్పాటు చేయాలని అందుకు కావాల్సిన సహకారం అందిస్తామన్నారు. ఖమ్మం మహిళా మార్టులో ఇంకా ఉత్పత్తులు పెంచాలని కోరారు.

గోదావరి జలాలతో

వైరా నియోజకవర్గం సస్యశ్యామలం

- వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్
- రాజీవ్ కెనాల్‌కు నీటి విడుదల



వినోభానగర్ వద్ద సీతారామ రాజీవ్‌లింక్ కెనాల్ వద్ద పూజలు చేస్తున్న వైరా ఎమ్మెల్యే

జూలూరుపాడు/ఏన్కూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గోదావరి జలాలను వైరా నియోజకవర్గంలోని జూలూరుపాడు, ఏన్కూర్, వైరా, కొణిజర్ల మండలాలలో భూములకు సాగునీటిని అందించి సస్యశ్యామలం చేస్తామని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. సోమవారం సాయంత్రం జూలూరుపాడు మండలంలోని వినోభానగర్ గ్రామం వద్ద సీతారామ మెయిన్ కెనాల్‌లో నుంచి గోదావరి జలాలను వైరా చెరువులోకి మళ్లించేందుకు 1500 క్యూసెక్కుల నీటిని రాజీవ్ లింక్ కెనాల్‌లోకి విడుదల చేశారు. లింక్ కెనాల్ వద్ద ఆయన ప్రత్యేక పూజలను చేశారు. ఆయన మాట్లాడుతూ వైరా నియోజకవర్గంలోని కారేపల్లి మినహా మిగిలిన 4 మండలాలలో 60వేల ఎకరాలకు గోదావరి జలాలను అందిస్తామని తెలిపారు. కారేపల్లి మండలానికి గోదావరి జలాలను తప్పనిసరిగా అందిస్తామని అన్నారు. గోదావరి జలాలను వైరా చెరువులోకి తరలించి సాగర్ ఆయుకట్టకు సాగునీటిని అందించాలని అసెంబ్లీలో మాట్లాడటం జరిగిందని, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల , పొంగులేటి తమకు సహకారాన్ని అందించారని తెలిపారు. డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలను చేపట్టి అన్ని మండలాలోని చెరువుల్లో గోదావరి జలాలను తరలించి రైతులకు సాగునీటిని అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతారామ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ అర్జున్, డీఈ చంద్రశేఖర్, ఏఈలు దేవదాస్ రాథోడ్, సాగర్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు బొర్రా రాజశేఖర్, లేళ్ల వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మంగీలాల్ నాయక్, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మేడా ధర్మారావు, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం

ఇల్లెందు టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టడంతో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు వ్యక్తులకు గాయాలు అయిన సంఘటన సోమవారం ఇల్లెందు చెరువు కట్టదగ్గర జరిగింది. పోలీసు కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా, గార్ల మండలం, ముత్యాలగూడేనికి చెందిన బీరబోయిన సాగర్ (23) చేరిపురం గ్రామానికి చెందిన వట్టం కొండల్, బుర్క రాజు, కలిసి బయ్యారం మండలం, ఏడుబావుల ప్రదేశానికి వెళ్లారు. అక్కడ నుంచి సోమవారం రాత్రి బైక్‌పై తిరిగి వస్తుండగా, ఇల్లెందు పట్టణంలోని పాకాల రోడ్డు మార్గంలోని చెరువు కట్ట వద్ద బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టారు. దీంతో సాగర్ మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన కొండల్‌ను ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మోటర్‌సైకిల్‌పై ఉన్న మరో వ్యక్తి బుర్కరాజుకు గాయాలయ్యాయి. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన సాగర్

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో

మేడేపల్లి విద్యార్థినుల ప్రతిభ

ముదిగొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం మేడేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు మంచిర్యాల జిల్లా రామకృష్ణాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ జూనియర్ చాంపియన్ పోటీల్లో రాణించి పతకాలు సాధించారు. ఉమ్మడి ఖమ్మంజిల్లా టీం నుంచి పాల్గొన్న మేడేపల్లి విద్యార్థినులు తనుశ్రీ, మహేశ్వరి రజిత పతకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు బండి నాగేశ్వరరావు తెలిపారు. గత సంవత్సరం కూడా వనపర్తిలో జరిగిన జూనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌లో తనుశ్రీ కాంస్య పతకం సాధించగా మహేశ్వరి రాష్ట్రస్థాయి కబడ్డీ జూనియర్ చాంపియన్‌లో కాంస్య పతకం సాధించిందన్నారు. రజత పతకాలు సాధించిన తనుశ్రీ, మహేశ్వరిని ఎంఈవో రమణయ్య, కోచ్ ఆదర్శ్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థినులు

సేంద్రియ ఎరువుతో భూసారం అభివృద్ధి

» కోన్ టిక్ కొలిమి విధానంలో బయోచార్ తయారీని పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్



సర్కారు తుమ్మ, చెట్ల కొమ్మలను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

చుంచుపల్లి, జూలై14(ఆంధ్రజ్యోతి): కోన్ టిక్ కొలిమి విధానంలో బయోచార్ తయారీ ప్రక్రియను కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. సోమవారం చుంచుపల్లి మండలంలోని విద్యానగర్‌కాలనీ గ్రామ పంచాయతీల్లోని డంపింగ్ యార్డులోని సెగ్రిగేషన్ షెడ్‌లో మట్టి, మట్టి ఇటుకలతో నిర్మించిన కోన్ టిక్ కొలిమి నందు ఎండిన సర్కారు తుమ్మ, చెట్ల కొమ్మలను చిన్న చిన్న ముక్కలుగా చేసి మంట ద్వారా బయోచార్ తయారు చేసే ప్రక్రియను పరిశీలించారు. ఈ విధంగా తయారైన బయోచార్ (జీవ బొగ్గు)ను గోమూత్రం, గోవుపేడలో కొన్ని రోజులు నిలువ ఉంచి, ఆరబెట్టి, పొడిచేసి పంటలకు సేంద్రియ ఎరువుగా వాడితే భూసారం అభివృద్ధి అవుతుందని, అధిక దిగుబడులు పొందవచ్చునని కలెక్టర్ తెలిపారు. గ్రామ పంచాయతీలలో గృహముల నుంచి, షాపుల నుంచి చెత్త సేకరించేటప్పుడు తడి చెత్త పొడి చెత్తగా వేరు వేరుగా సేకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుభాషిణి, డీఎల్పీవో ప్రభాకర్‌రావు, ఎంపీవో సత్యనారాయణ, ఈఈ నాగరాజు, ఏవో రాజేశ్వరి, ఏఈవో మమత తదితరులున్నారు.

అటవీ ప్రాంతంలో విత్తనాలు చల్లిన రామవరం పాఠశాల విద్యార్థులు

కలెక్టర్ జితేస్ వి పాటిల్ మార్గదర్శనంలో, ప్రకృతి పరిరక్షణకు భాగస్వాములుగా విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో, ఇటీవల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విత్తనాల సేకరణపై ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఆచరణాత్మకంగా తీసుకుంటూ రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సేకరించిన విత్తనాలను సోమవారం గరీబ్‌పేట్ రిజర్వ్ అటవీ ప్రాంతంలో జల్లారు. విద్యార్థులు స్థానికంగా సేకరించిన టేకు, చింత, గానుగ, వేప, పనస విత్తనాలను ప్రత్యేకంగా ఎంపిక చేసి వాటిని అటవీ ప్రాంతంలో ప్రకృతి సిద్ధంగా పునరావసం చేయాలని దృష్టితో చల్లారు. ఉపాధ్యాయులు నరేష్‌బాబు, శంకర్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి..

ఆత్మగౌరవంతో జీవించాలి

- ఇచ్చిన హామీ మేరకు పథకాలు అమలు చేస్తున్నాం
- రాజకీయాలకతీతంగా పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- ప్రతీ వారం నిధుల విడుదల
- మహిళాశక్తి సంబురాల్లో డిప్యూటీ సీఎం భట్టి

చింతకాని, జూలై 14(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలని, ఆత్మగౌరవంతో జీవించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అందులో భాగంగానే డ్వాక్రా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వడ్డీ లేని రుణాలతో పాటు ప్రమాద బీమా అందజేస్తున్నామన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా చింతకాని మండల కేంద్రంలో నిర్వహించిన మధిర నియోజకవర్గ ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల హయాంలో నిర్లక్ష్యం చేసిన వడ్డీ లేని రుణాలను తమ ప్రజా ప్రభుత్వం పునరుద్ధరించిందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న లక్ష్యంతో ఏడాదికి రూ.20వేల కోట్లు మహిళలకు వడ్డీ లేని రుణాలను ఈ నెల 12 నుంచి 21 వరకు పంపిణీ చేస్తున్నామన్నారు. దేశంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా మారి రైజింగ్ తెలంగాణగా రూపుదిద్దుకోనుందన్నారు. ఇల్లు లేదని ఏ ఒక్క కుటుంబం బాధపడకూడదని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ప్రతీ వారం నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామన్నారు. గత పాలకుల హయాంలో తాను ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు నిర్వహించిన పాదయాత్రలో ఇళ్లు లేక భయాందోళనలతో గడిపిన ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మొదటి దశలో రూ.22,500కోట్లతో 4.50లక్షల ఇళ్లను మంజూరు చేశామని, ఎక్కడా కూడా నిధుల సమస్య లేదన్నారు. గ్రామ పెద్దలను పిలిచి వారి సమక్షంలో పండుగ వాతావరణంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభం కావాలన్నారు. రాష్ట్రంలో రేషన్ కార్డు ద్వారా 93లక్షల పేద కుటుంబాలకు సన్నబియ్యాన్ని సరఫరా చేస్తున్నామని, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర పథకాలు అందిస్తున్నామన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఆయన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల మంజూరు, ప్రమాద బీమా చెక్కులను చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, డీఆర్డీవో సన్యాసయ్య, అంబటి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన గోపి, మడిపల్లి భాస్కర్, బండెల నాగార్జున, కొప్పుల గోవిందరావు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇస్తున్న భట్టి

భట్టికి అవ్వ ఆశీర్వాదం...

ఇంటి పట్టా మంజూరుతో వృద్ధురాలి నృత్యం

చింతకాని, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఇల్లు లేని తనకు ప్రజా ప్రభుత్వంలో ఇల్లు మంజూరైందంటూ ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన కంచర్ల మ రియమ్మ అనే వృద్ధురాలు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. చింతకాని మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన మహిళాశక్తి సంబురాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నుంచి పట్టా అందుకున్న ఆమె వేదికపైనే ఆనందంతో నృత్యం చేశారు. 'జై కాం గ్రెస్, జై భట్టి' అంటూ చేతులెత్తి నృత్యం చేశారు. ఈ క్రమంలో భట్టి విక్రమార్కకు ఆమెకు నమస్కరిస్తూ దగ్గరకు తీసుకోగా.. నూ రేళ్ల చల్లగా ఉండాలంటూ భట్టిని ఆమె ఆశీర్వదించారు. దాం తో త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేసే బాధ్యత కాంగ్రెస్ మండల నాయకులు తీసుకుంటారని చెప్పిన భట్టి.. ఆ మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లుకు పలు సూచనలు చేశారు. పట్టాలు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రజాప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు.

లకారం ట్యాంక్ బండ్‌లో వాటర్ ప్లాంట్ ఏర్పాటు

» రూ.5లక్షలు ఇచ్చిన ఎన్ఆర్ఐ తాళ్లూరి జయశేఖర్



వాటర్ ప్లాంట్ పనులు పరిశీలిస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం కార్పొరేషన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్‌బండ్‌కు వెళ్లే సందర్శకులకు ఇక శుద్ధమైన తాగునీరు అందనుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు విశేష సేవలు అందించిన తాళ్లూరి పంచక్షరయ్య కుమారుడు తాళ్లూరి జయశేఖర్ ఎన్ఆర్ఐ మాజీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఎక్కువగా ప్రజలు జనాధారణ ఉండే ప్రాంతంలో శుద్ధమైన తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. తన నిర్ణయాన్ని మేయర్ పునుకొల్లు నీరజకు తెలియజేయడంతో మేయర్ సూచనలతో కమిషనర్ అభిషేక్ అగస్త్య లకారం ట్యాంక్‌బండ్‌పై స్థలాన్ని కేటాయించారు. ఆయన తల్లి భారతి దేవి జ్ఞాపకార్థం పంచాక్షరయ్య ట్రస్టు ద్వారా రూ.5లక్షలతో వ్యయంతో డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ నిర్మాణం జరుగుతుంది. కాగా వాటర్ ప్లాంట్ షెడ్‌కు కావాల్సిన నిధులను కేఎంసీ నుంచి కేటాయించారు. సోమవారం ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ ప్లాంట్‌ను పరిశీలించారు. మంచి ఉద్దేశ్యంతో ఎన్ఆర్ఐలు అందించిన ప్లాంట్‌ను మంచి నాణ్యతతో నిర్మాణం చేయాలని, పది కాలాలపాటు ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించేలా ఏర్పాటు చేయాలని మేయర్ సూచించారు.

కొత్తగూడెం మెడికల్ కళాశాలలో

101 పోస్టుల భర్తీ

» ప్రిన్సిపాల్ డాక్టర్ రాజకుమార్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై14(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన 101 పోస్టుల భార్తీ చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాద్రి జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారం కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రొఫెసర్ (10), అసోసియేట్ ప్రొఫెసర్ (36), అసిస్టెంట్ ప్రొఫెసర్ (18), సీనియర్ రెసిడెంట్(37) ఉద్యోగాలను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించుటకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. కావున ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 17వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రభుత్వ వైద్య కళాశాల యందు నిర్వహించు ఇంటర్వ్యూలకు సకాలంలో హాజరు కావాలన్నారు.

20న ఉస్మాన్‌ఖాన్‌కు జీవన సాఫల్యం పురస్కారం



ములకలపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యో తి): ప్రముఖ కాలమిస్టు, కవి, రచయిత, అనువాదకులు ఎండీ. ఉస్మాన్‌ఖాన్‌కు ప్రతిష్టాత్మక గిడుగు వెంకట రామ్మూర్తి జీవన సాఫల్యం జాతీయ సాహితీ సేవా పురస్కారం-2025 ప్రకటించారు. ఈ నెల 20న హిందూపురంలో భారత సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి. గోపాలగౌడ్ చేతుల మీదుగా ఉస్మాన్ ఖాన్‌కు ఈ అవార్డును అందజేయనున్నట్లు సోమవారం నిర్వాహకులు తెలిపారు. తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించుకున్న గిడుగు వెంకట రామ్మూర్తి స్మరణలో ప్రతి సంవత్సరం ఈ అవా ర్డు అందజేస్తుంటారు. ఉస్మాన్‌ఖాన్ గత మూడున్నర దశాబ్దాలుగా తెలుగు, ఉర్దు, భాషల్లో సాహిత్యరంగానికి సేవలు అందిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి ఈ పురస్కా రం అందజేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. భారతీయ తెలుగు సాహిత్య అకాడమి, సత్య సాయి రచయితల సంఘం, అఖిల భారత షహీద్ టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు. భారత సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి. గోపాలగౌడ్, ప్రముఖ గజల్ దిగ్గజం గజల్ శ్రీనివాస్, చార్య రవిశంకర్ గురూజీ, ప్రముఖ స్వాతంత్ర్య సమురయోధుడు మెళవాయి గోవిందరెడ్డి, విశ్వవిజ్ఞాన విద్యాపీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా తదితరులు పాల్గొనున్నారు. జస్టిస్ గోపాలగౌడ్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

జాతీయస్థాయి శిక్షణకు ఎంపిక

బూర్గంపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండలంలోని జడ్పీహెచ్ఎస్ మోరంపల్లిబంజర ఉపాధ్యాయుడు తేజావత్ మోహన్ జాతీయస్థాయి శిక్షణకు ఎంపికయ్యారు. రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో సత్తా చాటారు. నూతన అభ్యసన ప్రక్రియలకు సంబంధించి ఉత్తమ ప్రదర్శన అందించిన ఉపాధ్యాయులను రాష్ట్రం నుంచి పది మందిని జాతీయస్థాయికి ఎంపిక చేయగా అందులో తేజావత్ మోహన్ ఉన్నారు. వీరు జూలై 16 నుంచి ఆగస్టు 5 వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయపూర్‌లో నిర్వహించే శిక్షణలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా డీఈవో వెంకటేశ్వరచారి, ఎంఈవో వై.సింహరాజు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు భాస్కరరావు ప్రత్యేకంగా అభినందించారు.



ఎంపికైన ఉపాధ్యాయుడితో విద్యాశాఖ అధికారులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెళ్లి అయిన రెండు నెలలకే విషాదం

కారేపల్లి,జూలై14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని భాగ్యనగర్‌తండా సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన విష్ణువర్ధన్(30) చికిత్స పొందుతూ మృతిచెందాడు. పెళ్లైన రెండు నెలలకే విష్ణువర్ధన్ మృతిచెందడంతో ఇల్లెందులో తీవ్ర విషాదచాయలు అలుముకున్నాయి. వరంగల్‌జిల్లా నెక్కొండకు చెందిన విష్ణువర్ధన్‌కు భద్రాద్రి జిల్లా ఇల్లెందు పట్టణానికి చెందిన యువతితో మే2న వివాహమైంది. విష్ణువర్ధన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నాడు. వారం తపు సెలవు కావడంతో భార్యను కలిసేందకు ఇల్లెందు వచ్చాడు. ఇద్దరు ఖమ్మం బైక్‌పై వెళుతుండగా భాగ్యనగర్‌తండా సమీపంలో కుక్కను తప్పించేక్రమంలో అదుపుతప్పి కిందపడ్డారు. అదేసమయంలో వారి వెనకనుంచి వచ్చిన ట్రాక్టర్ వారిపై నుంచి వెళ్లింది. వారికి తీవ్రగాయలు కావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

హస్లీ హత్య నిందితుడి అరెస్టు

- పరారీలో సుపారీ తీసుకున్న వ్యక్తులు
- వివరాలు వెల్లడించిన వైరా ఏసీపీ రహమాన్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రహమాన్

కొణిజర్ల, జూలై14(ఆంధ్రజ్యోతి): సహజీనం చేస్తూ ఆమెను హత్య చేసిన ఘటనలో నిందితుల్లో ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను వైరా ఏసీపీ రహమాన్ వెల్లడించారు. కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ విలేకరులతో మాట్లాడారు. కామేపల్లి మండలం టేకుల తండాకు చెందిన భూక్యా మదన్, అదేగ్రామానికి చెందిన భూక్యాహస్లీతో పరిచయం పెంచుకొని కొణిజర్ల మండలం విక్రంనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆరుసంవత్సరాలుగా విక్రంనగర్ లోనే కూలిపనులు చేసుకుంటూ ఉంటున్నారు. ఈ నేపథ్యంలో మూడేళ్ల క్రితం కొణిజర్ల మండలంలోనే అబ్బల్‌తండాకు చెందిన మరో మహిళను మదన్ రెండో పెళ్లి చేసుకున్నాడు. సహజీవనం చేస్తున్న హస్లీని, రెండో పెళ్లి చేసుకున్న మహిళను ఇద్దరిని ఒకే ఇంట్లో ఉంచి సంసారం సాగిస్తున్నారు. ఇటీవల రెండో పెళ్లి చేసుకున్న భార్యకు, హస్లీకి మధ్య వివాదం జరుగుతోంది. హస్లీని అడ్డుతొలగించుకోవాలని మదన్ భావించాడు. దీంతో కొణిజర్లకు చెందిన చల్లా నాగేశ్వరరావు, బస్వాపురం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి నరసింహరావుకు లక్షరూపాయలకు సుపారీ కుదుర్చుకున్నారు. ముందుగా అడ్వాన్సుగా యాభైవేలు ఇచ్చాడు. సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం కిష్టాపురం గ్రామ సమీపంలోని అడువుల్లో చంపేశారు.హస్లీ సహజీవనం చేస్తున్నప్పటికీ కూతుర్లతో రోజు ఫోన్ ద్వారా మాట్లాడుతూనే ఉంటుంది. నాలుగు రోజులుగా తల్లి ఫోన్ చేయకపోవడంతో చిన్న కూతురు పోలీస్‌స్టేషన్‌లో ఈనెల11న ఫిర్యాదు చేసింది. అనుమానం ఉన్నమదన్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. నేరాన్ని ఒప్పుకున్నాడు. దీంతో ఆయన్నుఅరెస్టు చేశారు. సుఫారీ తీసుకున్న వ్యక్తులు మాత్రం పరారీలోనే ఉన్నట్లు తెలిపారు. కేసును వెంటనే చేదించినందుకు ఎస్ఐ, సీఐ, పోలీస్ సిబ్బందిని అభినందించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐ సాగర్, ఎస్ఐ సూరజ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండు గంజాయి స్వాధీనం

- ఖమ్మంలో 30కేజీల స్వాధీనం
- తల్లాడలో 6.64 క్వింటాళ్ల గంజాయి దహనం

ఖమ్మం సంక్షేమవిభాగం, జూలై14(ఆంధ్రజ్యోతి): అనుమానస్పదంగా ఉన్న ప్లాస్టిక్ సంచుల నుంచి 30కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.సోమవారం ఉదయం ఖమ్మం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ శ్రీహరి సిబ్బందితో కలిసి ఖమ్మం నగరంలోని కొత్త బస్టాండ్ ఎదుట వాహనతనిఖీలు నిర్వహిస్తున్నారు. సమీపంలో ఓ రెండు ప్లాస్టిక్‌సంచులు కనిపించాయి. అధికారులు వాటిని పరిశీలించగా ఎండుగంజాయి కనిపించింది. నిందితుల కోసం గాలింపుచర్యలు చేపట్టినా అనుమానస్పద వ్యక్తులు కనిపించలేదు. దీంతో స్వాధీనం చేసుకున్న గంజాయిని సీజ్ చేశారు. హెడ్‌కానిస్టేబుల్స్ ఖరీం, బాలు, సిబ్బంది సుధీర్, వెంకట్, విజయ్, హనుమంతరావు, వీరబాబు, స్వరూప, ఉపేందర్ పాల్గొన్నారు.

ఇద్దరు యువకులు రిమాండ్

ఖమ్మంఖానాపురంహవేలి:నగరంలోని రాపర్తినగర్ డంపింగ్ యార్డ్ ఏరియాలో సోమవారం టూటౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరుయువకులు పోలీసులను చూసి పారిపోతున్నారు. వారిని అదుపులోకి తీసుకోని సోదాచేయాగా 130గ్రాములు గంజాయి దొరికినట్లు తెలిపారు. నేలకొండపల్లి మండలం తిరుమలపురానికి చెందిన బానోత్. గోపి సాయినాథ్, మహబూబాద్ జిల్లా మరిపెడ బంగ్లా జర్పులతండకు చెందినజర్పుల. కమల్ నాయక్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

6.64 క్వింటాళ్ల గంజాయి దహనం

తల్లాడ: ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న 6.64 క్వింటాళ్ల గంజాయిని సోమవారం తల్లాడ మండలం గోపాలపేట సమీపంలోని బర్నింగ్‌ప్లాంటులో ఎక్సైజ్ అధికారులు దహనం చేశారు. డీఓఈ ఆదేశాల మేరకు ఖమ్మంజిల్లాకు సంబంధించిన 1.82క్వింటాళ్లు, భద్రాద్రి కొత్తగూడెంజిల్లాకు చెందిన 4.82 క్వింటాళ్ల గంజాయిని దహనం చేశారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

- డాబాపై దుస్తులు ఆరేస్తుండగా తగిలిన 11కేవీ వైర్
- అధికారుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబీకుల ఆరోపణ
- సబ్ స్టేషన్‌పై దాడి.. మృతదేహంతో ధర్నా
- ఖమ్మం జిల్లా రూరల్ మండలంలో ఘటన
- భర్త ఫిర్యాదుతో విద్యుత్ అధికారులపై కేసు నమోదు



ఖమ్మంరూరల్, జూలై14(ఆంధ్రజ్యోతి): డాబాపై దుస్తులు ఆరేస్తుండగా.. ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ వైరు తగిలి.. మహిళ మృతిచెందిన సంఘటన ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం కస్నాతండాలో సోమవారం ఉదయం జరిగింది. గ్రామస్థులు, పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మార్తి సైదయ్య, మాధవి అలియాస్ ముత్తమ్మ(40) దంపతులకు ఇద్దరుకుమారులున్నారు. సైదులు గొర్రెల కాపరిగా పనిచేస్తుండగా మాధవి వ్యవసాయకూలిగా పనిచేస్తోంది. వారి ఇంటిపై నుంచి 11కేవీ విద్యుత్ వైర్లు పోయాయి. సోమవారంఉదయం మాధవి డాబాపై దుస్తులు ఆరేస్తుండగా అవి విద్యుత్ వైర్లకు తగిలి ఆమె షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది.

మృతదేహంతో సబ్‌స్టేషన్ ముందు ధర్నా

మాధవి మృతికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆరోపించారు. ఆమె మృతదేహన్ని పల్లెగూడెంలోని సబ్‌స్టేషన్ ఎదుట ఉంచి మూడు గంటలపాటు ధర్నా చేశారు. ఈ సమయంలో కొందరు ఆ సబ్‌స్టేషన్‌పై దాడి చేసి అద్దాలు, తలుపులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు, అఖిలపక్ష పార్టీలనాయకులు మాట్లాడుతూ గ్రామం మధ్యలో, ఇళ్లపై నుంచి వెళ్లిన 11కేవీ విద్యుత్ లైన్‌ను తొలగించేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిధులు మంజూరు చేయించారని, గ్రామం బయటనుంచి లైన్లు తీయాలని సూచించినా అధికారులు నిర్లక్ష్యంతో వాటిని తొలగించకుండా ఉంచారని మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మాధవి మృతి చెందిందన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థులను సముదాయించడంతో ధర్నావిరమించారు.

విద్యుత్ అధికారులపై కేసు నమోదు

మాధవి మృతికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆమె భర్త సైదయ్య ఇచ్చిన ఫిర్యాదుతో ఖమ్మం రూరల్ పోలీసులు విద్యుత్ అధికారులపై కేసు నమోదు చేశారు.ఏడీ బానోత్ రామకృష్ణ, ఏఈ సగ్గుర్తి రామారావు, లైన్‌ఇన్‌స్పెక్టర్ సీతయ్య, లైన్‌మెన్ భాస్కర చారి, ఏఎల్ఎమ్ కృష్ణ అర్జున్‌పై కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

లైన్ సమీపంలో ఇల్లు కట్టుకున్నారు

- ఎన్నిసార్లు చెప్పినా వినలేదు.. మా తప్పేం లేదు
- టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాసాచారి వివరణ



విద్యుత్ ప్రమాదానికి గురై ఖమ్మంరూరల్ మండలం కస్నాతండాకు చెందిన మార్తి మాధవి అలియాస్ ముత్తమ్మ మృతి ఘటనపై టీజీ ఎన్పీడీసీఎల్ ఖమ్మం పర్యవేక్షక ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి వివరణ ఇచ్చారు. కస్నాతండాలోని 11కేవీ విద్యుత్ లైన్ సమీపంలో ముత్తమ్మ ఇంటి నిర్మాణం జరిగిందని, దీనిపై పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులు హెచ్చరించినా వినలేదని, ఇందులో విద్యుత్ శాఖ తప్పిదం ఏమీ లేదని స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే ఆ ఇంటికి అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తున్నారని తెలుసుకుని.. గతేడాది ఏప్రిల్ 18నే వారి అక్రమ సర్వీస్ ను తొలగించి కేసు కూడా నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు

మరో ఇద్దరు నిర్దోషులుగా తీర్పు

ఖమ్మంలీగల్,జూలై14(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని బీకే బజార్ ప్రాంతానికి చెందిన ఉల్లోజు నాగరాజు అలియాస్ నాగయ్య హత్య కేసులో జీవితఖైదు శిక్షతోపాటు రూ.పదివేల జరిమానా విధించారు.ఖమ్మంషెడ్యూల్ కులాలు మరియు షెడ్యూల్ తెగల ప్రత్యేక న్యాయస్థాన న్యాయాధికారి దేవినేని రామ్‌ప్రసాదరావు సోమవారం తీర్పు చెప్పారు. ఖమ్మం నగరంలోని బీకే బజార్ ప్రాంతానికి చెందిన వడ్డేటి నారాయణ కుమారుడు శివపై ఉల్లోజు నాగరాజు, పిరంగి సాయి, పిరంగి కుమార్ కత్తితో దాడి చేశారు.దీనిపై కుటుంబ సభ్యులు ఖమ్మం ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కేసు విషయంలో రాజీపడేందుకు నిందితులు ఒత్తిడి తెచ్చారు. బాధితులు రాజీపడేందుకు అంగీకరించలేదు. ఈక్రమంలో 21జనవరి 2024 నాగరాజు రాజీ మాట్లాడదామని శివని తీసుకెళ్లినాడు. ఆయన తండ్రి కూలి పనులకు వెళ్లాడు. కాగా శివ కిమ్స్ హాస్పిటల్‌లో స్పృహతప్పి పడిపోవటంతో మీ ఇంట్లో పడుకోబెట్టమని బంధువులు తండ్రికి ఫోన్‌చేశారు. ఆయన ఇంటికి వచ్చి చూడగా నోటినుంచి రక్తం రావటంతో వెంటనే ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఈక్రమంలో శివ మృతి చెందాడు. తన కుమారుడిని నాగరాజు కర్రతో తలపై కొట్టి గాయపచటం వలన మరణించాడని, పైముగ్గురు నిందితులపై ఖమ్మం ఒకటో పోలీస్‌స్టేషన్ ఫిర్యాదుచేయగా నిందితులపై కేసు నమోదుచేశారు. నిందితులను అరెస్ట్‌చేసి కేసును విచారించిన అప్పటి సీఐ టీ.స్వామి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి మొదటి నిందితుడిపై నేరం రుజువుకావటంతో పైవిధంగా తీర్పుచెప్పారు. మిగిలిన ఇద్దరిపై నేరంరుజువు కాకపోవటంతో నిర్దోషులుగా విడుదల చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున బి.కృష్ణమోహనరావు, లైజన్ కె.శ్రీకాంత్, డి.నాగేశ్వరరావు, కోర్టు కానిస్టేబుల్ రామక్రిష్ణ, హోమ్‌గార్డ్ ఎం.డి.పాషా సహకరించారు.

లాడ్జిలో ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



మధిరరూరల్, జూలై14(ఆంధ్రజ్యోతి): ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం మధిరలోని నవయుగ లాడ్జిలో చోటుచేసుకుంది. పోలీసుల ప్రకారం... ఏపీలోని విజయవాడకు చెందిన కత్తి బాబ్జీ (55) హైదరాబాద్‌లో కొన్ని సంవత్సరాలుగా ఉంటున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఇతను ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. సంవత్సరంన్నర కాలం నుంచి కుటుంబంలోని మనస్పర్థలతో భార్య, కుమారుడికి దూరంగా ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం మధిరలోని నవయుగ లాడ్జికి వచ్చి రూమ్ తీసుకున్నాడు. సోమవారం ఉదయం లాడ్జిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం పదిగంటల సమయం దాటినా బాబ్జీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన లాడ్జి సిబ్బంది కిటికీలోనుంచి తొంగి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతూ కన్పించాడు. దీంతో టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. అతడి జేబులో ఉన్న పలు ఐడీకార్డుల ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ కలహాలు, అనారోగ్య సమస్యల కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లుగా భావిస్తున్నారు. మృతుడి సోదరుడు కత్తి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ఆసుపత్రికి తరలించారు.

జ్వరంతో విద్యార్థి మృతి

గుండాల, జూలై14 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా తీవ్రజ్వరంతో బాధపడుతూ ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని మామకన్ను గ్రామానికి చెందిన కల్తి భాను ప్రకాష్(13) అదే గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. నాలుగు రోజులుగా జ్వరం వస్తుండటంతో కుటుంబ స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ వద్ద వైద్యం అందించారు. ఈ క్రమంలోనే కామెర్లు సోకాయి. సోమవారం పరిస్థితి విషమంగా ఉండటంతో 108 ద్వారా గుండాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడు భానుప్రకాశ్ తండ్రి రంగనాథం ఐదునెలల క్రింత మృతి చెందాడు..



వైదిక సంఘం అధ్యక్షుడిగా సీతారామశాస్త్రి



ఖమ్మంఖానాపురంహవేలి,జూలై14(ఆంధ్రజ్యోతి): జిల్లా వైదికసంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు దేవలపల్లి. ఆంజనేయశర్మ, కొనగంచి. సాయిరాము శర్మ తెలిపారు. నగరంలోని గట్టయ్య సెంటర్‌లో జరిగిన వైదిక సంఘం సమావేశంలో కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈకమిటీ 2025 నుంచి 2028 వరకు కాలపరిమితి ఉంటుందని తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా తాటికొండాల. సీతారామశాస్త్రి, ప్రధాన కార్యదర్శిగా కాందూరి. సరస్వతీ కుమార్‌శర్మ, కోశాధికారిగా కొనగంచి. ప్రసాద్ శర్మను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

» అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంకలెక్టరేట్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతీ శాఖ పరిధిలోని ఫిర్యాదులను ఆ వారంలో సమీక్షించి పరిష్కరించాలని ఆయన సూచించారు. ప్రజావాణిలో డీఆర్వో ఏ.పద్మశ్రీ, కలెక్టరేట్ పరిపాలన అధికారి కారుమంచి శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

ఫిర్యాదుల్లో కొన్ని..

● సింగరేణి మండలం గుడితండా గ్రామానికి చెందిన కొత్తూరి వీరమ్మ తనకు స్వాతంత్ర్య సమరయోధుల కోటాలో ఇంటి స్థలం కేటాయించాలని కోరింది.

● ఖమ్మం నగరం జెడ్పీ కాలనీకు చెందిన సరికొండ జానకీ రామరాజు తమ ఇంటి నెంబర్ పై వేరే వారి పేరు వస్తున్నదని, పేరు వచ్చే విధంగా చూడాలని కోరింది.

● సింగరేణి మండలం చీమలపాడు గ్రామానికి చెందిన పాటి అనంతరాములు సర్వే నెంబర్ 154/2 లో భూమి పూర్తి సర్వే చేసి తన పేరు నమోదు చేయాలంటూ విజ్ఞప్తి చేశాడు.

● మధిర మండలం సిరిపురం గ్రామ ఎస్సీ కాలనీ వాసులు స్మశాన వాటిక ఆక్రమణకు గురైందని, ఇక్కడ అక్రమంగా రేకుల షెడ్డు వేసి స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

కొత్తపల్లి శేషుకు ఉత్తమ దర్శకుడు అవార్డు



పలువురు ఖమ్మం కళాకారులకు ఇంటర్నేషనల్ సినీ అవార్డులు..

ఖమ్మంసాంస్కృతికం,జూలై14(ఆంధ్రజ్యోతి): ఖమ్మానికి చెందిన పలువురు కళాకారులకు ప్రతిష్టాత్మక మలేషియా ఇంటర్నేషనల్ సినీ అవార్డులు లభించాయి.. ప్రముఖ రచయిత, దర్శకుడు కొత్తపల్లిశేష దర్శకత్వం వహించిన కల్లూరు అప్పయ్య, సంక్రాంతి 2కె25 అనే మినీ మూవీస్‌లకుగానూ ఈఅవార్డులు వచ్చాయి.. కల్లూరు అప్పయ్య చిత్రం గతేడాది విడుదల కాగా సంక్రాంతి 2కె25 చిత్రం ఈఏడాది విడుదలయ్యింది. యూట్యూబ్‌లో విడుదలైన ఈ రెండు చిత్రాలకు గానూ కొత్తపల్లి శేషుకు ఉత్తమ దర్శకుడు, ఉత్తమరచయత, స్క్రీన్‌ప్లే అవార్డులు దక్కాయి. సంక్రాంతి 2కె25 చిత్రానికి గానూ. చిత్రనిర్మాత గుజ్జూరి శ్రీధర్‌బాబు ఉత్తమ నిర్మాతగా అవార్డు గెలుచుకున్నారు. కామెడీ విలన్‌గా నటించిన మొగిలి గుణకర్‌కు ఉత్తమనటుడు అవార్డుకు ఎంపికయ్యారు. వీరితోపాటు కళాకారులు కిషోర్‌బాబు, మహేశ్వరి, యామినిలకు, కోడైరెక్టర్ రవితోప్, కెమెరామెన్ ఉదయ్‌కుమార్,చందులకు ఉత్తమ అవార్డులు దక్కాయి. త్వరలో విజేతలకు బహుమతులు అందజేస్తారని మలేషియా ఇంటర్నేషనల్ సినీ అవార్డ్సు కమిటీ తెలియజేసింది.

వరద పరిహారంలో చేతివాటం

» తిరుమలాయపాలెంలో గతేడాది భారీ వరద
» కొట్టుకుపోయిన పశువులు, మేకలు, కోళ్లు
» పశువైద్యాధికారి, ఆమె భర్త పరిహారం లెక్కింపులో అక్రమాలు



తిరుమలాయపాలెం, జూలై14(ఆంధ్రజ్యోతి): వరద పరిహారంలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయి. పశువులు కొట్టుకుపోవటంతో వీటి పరిహారం మంజూరులో పశువైద్యాధికారి, ఆమె భర్త చేతివాటం ప్రదర్శించారు. గతేడాది భారీవర్షంతో మండలంలోని అజ్మీరతండా పంచాయతీ శివారు రాకాసితండాను ఆకేరు వరద చుట్టుముట్టింది. దీంతో ప్రాణభయంతో గ్రామస్తులు గుట్టలు, డాబాలపై ఎక్కి తమ ప్రాణాలు దక్కించుకున్నారు.గ్రామానికి చెందిన 78మంది ఇళ్లలోని ధాన్యంతో పాటువిలువైన వస్తువులు, ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్ల వరదలో కొట్టుకుపోయాయి. వరద నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందంతో పాటు రాష్ట్ర బృందం, మంత్రులు, అధికారులు పర్యటించారు. బాధితులకు పరిహారం ప్రకటించారు. ఈ క్రమంలో మూగజీవాల పరిహారంలో తిరుమలాయపాలెం పశువైద్యాధికారి ఆమె భర్త సాయి చేతివాటంప్రదర్శించారు. వరదలు ఒక చోట అయితే మరోచోట పరిహారం ఇప్పించి భారీ ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడినట్టు గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఒక్కో ఇంటిలో ఒకటి, రెడు గేదెలు కొట్టుకుపోతే పెద్దమొత్తంలో కొట్టుకుపోయాయని సూచించి బాధితుల నుంచి డబ్బులు తీసుకున్నట్టు గ్రామస్తులు చెబుతున్నారు. పశువైద్యురాలి భర్తరాకాసితండా వాసుల అకౌంట్‌లోడబ్బులు పడకుండా వారి అకౌంట్లలోకి మళ్లించి అక్రమాలకు పాల్పడ్డారని చెబుతున్నారు. జర్పుల వెంకన్నకు పరిహారం కింద రూ.78వేలు మంజూరయితే, వాటిల్లో ఇంకా రూ.18వేలు ఇవ్వలేదంటూ బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మరికొందరి నష్టపరిహారానికి అకౌంట్‌లోకి మళ్లించుకున్నట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పూర్తి విచారణ చేపడితే అక్రమాలు వెలుగులోకి వస్తాయని బాధితులు పేర్కొంటున్నారు.

మెకానిక్ కుటుంబానికి ఆర్థికసాయం

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బుజ్జి నవీన్ కుటుంబానికి జిల్లా టూవీలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్థికసాయం అందించారు. పట్టణంలో టూవీలర్ మెకానిక్‌గా పనిచేస్తున్న నవీన్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టూవీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగాల కొండలరావు ఆధ్వర్యంలో రూ.30వేలు, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాఫర్ రూ.10వేలు మొత్తం రూ.40వేలను నవీన్ కుటుంబ సభ్యులకు అందించారు. యూనియన్‌లో ప్రతీ మెకానిక్ సభ్యత్వం తీసుకోవాలని, తీసుకున్న వారికి యూనియన్ సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో లింగనబోయని మురళి, బల్లి నాగేశ్వరరావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, శివరామకృష్ణ, మండే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఎస్‌బీఐటీ విద్యార్థుల ఎంపిక

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై14 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రాంగణ నియమకాల్లో కళాశాలకు చెందిన 41మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల. కృష్ణ తెలిపారు. వివిధ దశలో నిర్వహించిన ఎంపికల పరీక్షలలో మొదట కమ్యూనికేషన్ టెక్‌స్కై. 64మంది ఎంపిక కాగా, చివరి హెచ్ ఆర్ రౌండ్‌లో 41మంది ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రూ.3లక్షలకుపైగా వార్షిక ఆదాయం అందుతుందని తెలిపారు.ఈకార్యక్రమంలో కరస్పాండెంట్, సెక్రటరీ జీ.ధాత్రీ, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, డైరెక్టర్లు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



పేదలకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వ పాలన

» రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
» తిరుమలాయపాలెంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సభలో మాట్లాడుతున్న పొంగులేటి

తిరుమలాయపాలెం, జూలై14(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వ పాలన కొనసాగుతుందని రెవెన్యూశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వివిధగ్రామాల్లో వివిధ పనులను ఆయన ప్రారంభించారు. మరికొన్ని పనులకు శంకుస్థాపన చేశారు. అజ్మీరతండానుంచి రాకాసితండా వరకు హైలెవల్ బ్రిడ్జి, అప్రోచ్‌బ్రిడ్జి నిర్మాణ పనులు, హైదర్‌సాయిపేటనుంచి సీరోలువరకు,హైదరసాయిపేటనుంచి చిలుక్కోయలపాడు వరకు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జల్లేపల్లి నుంచి దేవుడి గుట్ట వరకు బీటీరోడ్డు నిర్మాణానికి, సిమెంట్ రోడ్డు పనులు,తాగునీటిపనులకు శంకుస్థాపన చేశారు. పాతర్లపాడు క్రాస్‌రోడ్డునుంచి రావిచెట్టుతండా రహదారికి, పాతర్లపాడు క్రాస్‌రోడ్డు నుంచి జల్లేపల్లి వరకు రోడ్డుకు శంకు స్థాపన చేశారు. సుబ్లేడులో ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ నిర్మాణానికి, పాలేరునుంచి మరిపెడ రోడ్డులో డ్రైయినేజీ పనులకు, సుబ్లేడలో సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. పాలేరు నుంచి మరిపెడ రోడ్డుకు, సుబ్లేడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్రపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, మాజీఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మార్క్‌ఫెడ్ మాజీవైస్‌చైర్మన్ బొర్రారాజశేఖర్, జిల్లాకాంగ్రెస్‌నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, ఆత్మకమిటీచైర్మన్ చావా శివరామకృష్ణ, మాజీజడ్పీటీసీ బెల్లం శ్రీను, మాజీ ఎంపీపీ బోడా మంగీలాల్, ఇరిగేషన్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, ఆర్డీవో నరసింహారావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, గిరిజనసంక్షేమ డీడీ విజయలక్ష్మి, ఈఈపవార్, తహసీల్దార్ లూథర్ విల్సన్,ఎంపీడీవో సిలార్‌సాహెబ్‌పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి వినతి

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ అఖిలపక్షపార్టీల ఆధ్వర్యంలో సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు.వందగ్రామాలకు కూడలి కేంద్రంగా ఉన్న సుబ్లేడు గ్రామాన్ని మండలంగా ఏర్పాటుచేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో భూక్యా వీరన్న, వళపొంగు వీరన్న, నరసింహారెడ్డి, గండమల సుందర్, కూరపాటి విజయ్, కామల్ల వీరయ్య, మెట్ట ఆంజనేయులు, బాలరాజు,రమేష్ సత్య, యలమంద పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై14 (ఆంధ్రజ్యోతి): బీసీసంక్షేమశాఖ, బీసీ స్టడీ సర్కిల్ ఖమ్మం ఆధ్వర్యంలో గ్రూప్ 1, 2, 3,4తోపాటుఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీ బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం ఈనెల 16 నుంచి ఆగస్టు 11లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం తెలిపారు. శిక్షణ ఆగస్టు 25 నుంచి 150 రోజులు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డిగ్రీ పాసైన అభ్యర్థులు ఈ దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో రూ. 1.5లక్ష, పట్టణప్రాంతాల వారికి రూ. 2లక్షలలోపు వార్షిక ఆదాయం కలిగి ఉండాలని తెలిపారు. డిగ్రీపరీక్షల్లో అత్యధిక శాతం మార్కులు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.1000 చొప్పున ఐదునెలల ఉపకార వేతనం అందిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు 9573859598, 9441931359ను, బీసీస్టడీ సర్కిల్ కార్యాలయంలో సంప్రదించాలని స్టడీ సర్కిల్ డైరెక్టర్ జీ. శ్రీలత తెలిపారు.

ప్రజాసమస్యల అజెండాగా ఉద్యమ కార్యాచరణ

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

ఖమ్మంసంక్షేమవిభాగం, జూలై14 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఉన్న సమస్యలే అజెండాగా పార్టీ కార్యక్రమాలు, ఉద్యమాలను రూపొందించుకొని ముందుకు సాగాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో తోటా రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. పాలకులు ప్రజా సమస్యలను విస్మరించి పరిపాలన చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం చేకూర్చేలా పని చేస్తోందన్నారు. రైతులు, కూలీలు, దిగువ మధ్య తరగతి ప్రజలు, పేదలకు సంబంధించిన ఎటువంటి ఆర్థికప్రయోజనకర నిర్ణయాలు కేంద్రప్రభుత్వం తీసుకోవటం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలపై ప్రచారం చేసుకున్నంతగా అసలైన లబ్ధిదారులకు పథకాలు అందటం లేదన్నారు. రుణమాఫీ విషయంలో రైతులు సంతోషంగా లేరన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఖమ్మంలో భారీబహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్పొరేటర్ బీజే క్లైమెట్, నాయకులు దండి సురేశ్, మహ్మద్ సలామ్ పాల్గొన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

» కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మంకలెక్టరేట్, జూలై 14(ఆంధ్రజ్యోతి): వన మహోత్సవం విజయవంతానికి ప్రణాళిక చేసి, పటిష్ట కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి రెవెన్యూ, అటవీ భూములు, వన మహోత్సవం, ప్రభుత్వ గురుకులాల్లో శుచి, శుభ్రతపై రెవెన్యూ, అటవీ, గురుకులాల ప్రాంతీయ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలాల వారిగా 10 ఎకరాలకు తక్కువ కాకుండా బ్లాకుల గుర్తించాలన్నారు. నాటిన మొక్కల సంరక్షణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ అనే మాట రాకూడదని, ఈ దిశగా సంబంధిత ఆర్సీఓ లు పర్యవేక్షణ చేయాలన్నారు. తహసీల్దార్లు వారి పరిధిలోని ప్రభుత్వ గురుకులాల సందర్శన వారానికి ఒక సారైనా చేపట్టి, పరిసరాలు, కిచెన్, వంటలు ఎలా జరుగుతున్నాయి తనిఖీలు చేయాలని, పిల్లలతో భోజనం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మండలాల వారిగా ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, అటవీ భూముల పరిస్థితిపై అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.



మంత్రిని కలిసిన కలెక్టర్, కమిషనర్

ఖమ్మంఆంధ్రజ్యోతిప్రతినిధి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసంలో సోమవారం కలెక్టర్ అనుదీప్, కార్పొరేషన్ కమిషనర్ కలిశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి సమావేశంలో చర్చించారు.

భట్టి వ్యాఖ్యలపై బీజేపీ నిరసన

ఖమ్మంమార్కెట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా బీజేపీ కార్యకర్తలు సోమవారం నగరంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్‌రావుపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చేసిన విమర్శలు, రోహిత్ వేముల ఘటనను ఆధారంగా తీసుకొని చేసిన పలు ఆరోపణలను ఖండిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన నిరసనలతో జెడ్పీ కూడలిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయంతో పాటు కొంత ఉద్రిక్త నెలకొంది. పోలీసులు నిరసనకారులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ దళితులను కించపరిచే విధంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడారని అలా అగౌరవ పరిచే మాటలు సమంజసం కాదని పేర్కొన్నారు. భట్టివిక్రమార్క దళితులకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు కోటమర్తి సుదర్శన్, నాయకులు గెంటేల విద్యాసాగర్, అల్లిక అంజయ్య, నున్నా రవి, ప్రతాప్, చిన్నిక్రిష్ణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



డైట్ చార్జీలు విడుదల చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై14 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న వసతిగృహాల డైట్ చార్జీలు విడుదల చేయాలని భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(డీఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం నగరంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు వీరభద్రం, సూర్య ప్రకాష్ మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ, బీసీ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీల్లో చదువుకునే విద్యార్థులకు 5 నెలలుగా పెండింగ్‌లోఉన్న డైట్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచినప్పటికీ సకాలంలో రాకపోవటంతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందటంలేదన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్, రావత్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

23న కేఎంసీ కౌన్సిల్ సమావేశం

ఖమ్మంకార్పొరేషన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ పాలకవర్గ సమావేశం ఈనెల23న జరగనుంది. ఈ మేరకు తన ఛాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో మేయర్ పునుకొల్లు నీరజ మార్గదర్శకం చేశారు. కార్పొరేటర్లుకు ముందుగా ఏజెండా కపీలను పంపాలని, ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు.

ఐటీఐ కాలేజీలో ఏర్పాటు చేయాలి

తిరుమలాయపాలెం, జూలై14(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెంలోని సర్వేనెంబరు 254లోని ప్రభుత్వ భూమిలో ఐటీఐ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ప్రజవాణిలో అధికారులకు వినతిపత్రం అందించారు. 254లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని, ఆ స్థలంలో ఐటీఐ కాలేజీ నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నేర్సుల వెంకటేష్, కె.నాగేశ్వరారవు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్



ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాకతీయ యునివర్సిటీ నుంచి బంగారు పతకాలను అందుకున్న నగరంలోని పీజీ కళాశాల విద్యార్థులను సోమవారం కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు అభినందించారు. అర్థశాస్త్రంవిభాగంలో 13 మంది విద్యార్థులకు కేయు స్నాతకోత్సవం సందర్భంగా బంగారు పతకాలను అందించిందని ప్రిన్సిపాల్ తెలిపారు. 20216నుంచి 2021 విద్యాసంవత్సరం వరకు యూనివర్సిటీ టాపర్లుగా నిలిచి ఈ పతకాలు సాధించారని తెలిపారు.

రాయల స్ఫూర్తితో ఉద్యమాలు

తిరుమలాయపాలెం, జూలై14(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఎంఎల్ కేంద్ర కమిటీ సభ్యుడు రాయల చంద్రశేఖర్ స్ఫూర్తితో ఉద్యమాలు చేపడుతున్నట్టు సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లానాయకుడు తిమ్మిడి హనుమంతరావు తెలిపారు. సోమవారం బచ్చోడులో ఆపార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 16న ఇల్లెందులో రాయల చంద్రశేఖర్, చంద్ర కృష్ణమూర్తి, గండి యాదన్నల స్మారక స్థూపావిష్కరణ, వర్ధంతి సభ జరుగుతుందన్నారు. దీనిని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లివెంకటరెడ్డి, పసలాది వెంకన్న, నర్సింహారెడ్డి, వీరయ్య, రఘుబాబు పాల్గొన్నారు.

కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం కరుణాకర్

ఖమ్మంరూరల్, జూలై14(ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కల్లుగీత సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం కరుణాకర్ ప్రభుత్వాన్ని కోరారు. కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల ఎక్స్‌గ్రేషియాను వెంటనే మంజూరు చేయాలన్నారు. గ్రామాల్లో చెరువుకట్టల పక్కన తాటి, ఈతవనాలను పెంచుకోవడానికి ప్రభుత్వం ఉచితంగా మొక్కలు సరఫరా చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సంగయ్య, వెంకటేశ్వర్లు, ఉపేందర్, ముత్తయ్య, నాగేశ్వరరావు, పవన్, మల్లయ్య, సైదులు, మధు, రంగయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్త మేడేపల్లిని సందర్శించిన డీఈవో

ఏన్కూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం కొత్తమేడేపల్లి గొత్తికోయ గిరిజన వలస గ్రామాన్ని సోమవారం డీఈవో ఎస్.సత్యనారాయణ సందర్శించారు. గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 30మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ట్యాంకర్

ఐదుగురికి తీవ్రగాయాలు



కారేపల్లి,జూలై14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కామేపల్లి బస్టాండ్‌లో సోమవారం ఖమ్మం నుంచి ఇల్లెందు వెళ్తున్న ఆర్టీసీలో ప్రయాణికులు దిగుతున్న సమయంలో సిమెంట్ య్యాస్ ట్యాంకర్ బస్సును ఢీ కొట్టింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులకు గాయాలయ్యాయి. వారిలో ఐదుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలు గాయాలు కాగా వారిని స్థానికులు ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.ఎస్ఐ గోపి కేసు నమోదు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

బోనకల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీలో తాత్కాలిక పద్ధతిలో పని చేసేందుకు గానూ అటెండర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో దామాల పుల్లయ్య తెలిపారు. 18నుంచి 45 ఏళ్ల లోపు వయస్సు కలిగి, పదవ తరగతి ఉత్తీర్ణులైన మహిళలు ఈనెల 18లోపు కేజీబీవీలో దరఖాస్తులను అందజేయాలని కోరారు.

అధ్వానంగా రహదారులు

» అసంపూర్తిగా ఉన్న వైరా-మధిర, జగ్గయ్యపేట రోడ్డు పనులు

వైరా, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఏడాది దాటినా వైరా-మధిర, జగ్గయ్యపేట ఆర్అండ్బీ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగానే మిగిలిపోయింది. ఈ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే రీతిలో ఉన్నాయి. రూ.12కోట్లతో చేపట్టిన ఈ నిర్మాణం అతీగతీ లేకుండాపోవడంతో ఈ రూట్లోని వేలాదిమంది వాహనచోదకులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వైరాలోని జాతీయ ప్రధాన రహదారి నుంచి సోమవరం సమీపంలోని గ్రీన్ఫీల్డ్ హైవే అండర్పాస్ హైలెవల్ వంతెన వరకు ఈ రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారు. తరచూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సహా జిల్లాకు చెందిన మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్నాయక్, జిల్లా ఉన్నతాధికారులు అసంపూర్తిగా గుంతలతో నిండి ఉన్న ఈ రోడ్డు నుంచే రాకపోకలు కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ దీని నిర్మాణం నత్తనడకను తలపిస్తుంది. ప్రస్తుతమున్న రెండు వరుసల రోడ్డును నాలుగు వరుసల రోడ్డుగా అభివృద్ధి, డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణం చేయాల్సి ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ నిధులు మంజూరయ్యాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదట్లో కొన్నినెలలపాటు పనులు ప్రారంభించకుండా నిలిపివేశారు. ఆతర్వాత వచ్చిన గ్రీన్ సిగ్నల్తో 2024 మార్చి, ఏప్రిల్లో ఈ అభివృద్ధి పనులను ప్రారంభించారు. మొదట్లో రెండు, మూడు నెలలపాటు బీటీ రోడ్డుకు రెండు వైపులా చురుగ్గా పనులు నిర్వహించారు. వెట్మిక్స్తో పనులు చేశారు. ఇక ఆతర్వాత నుంచి నత్తనకడను మించిన జాప్యం ఈ పనుల్లో జరుగుతుంది. ముఖ్యంగా వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల వరకు దాదాపు 700 మీటర్ల దూరం రోడ్డు మొత్తాన్ని తవ్వి వెట్మిక్స్తో నింపారు. దుమ్ము, ధూళి, గుంతలతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. ఆసమయంలో స్థానికుల నుంచి తీవ్ర అసంతృప్తి రావడంతో ఎమ్మెల్యే రాందాస్నాయక్ జోక్యం చేసుకొని ఆర్అండ్బీ అధికారులను హెచ్చరించారు. ఆవెంటనే రోడ్డుకు ఒకవైపు రెండువరుసలతో 700మీటర్ల దూరం బీటీ వేశారు. మరోవైపు ఈ దూరం మొత్తం వెట్మిక్స్తో ఉన్నప్పటికీ ఇంతవరకు బీటీ వేయలేదు. నెలకోసారి కంటి తుడుపుగా ఒకట్రెండురోజులు పనులు చేయటం ఆతర్వాత కాంట్రాక్టర్, అధికారులు పత్తా లేకుండాపోవడం పరిపాటిగా మారింది. బిల్లులు రాక ఈ పనులు చేయడం లేదని కాంట్రాక్టర్ చెబుతున్నారు. బిల్లులు రాక కాంట్రాక్టర్ ఈపనులు చేయకుండా చేతులెత్తేశాడనే సమాచారం తెలుసుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొద్దిరోజుల కిందట చేసిన పనుల వరకు బిల్లులు చెల్లించారని సమాచారం. అయినప్పటికీ కాంట్రాక్టర్ ఇంతవరకు మళ్లీ పనులు చేయకపోవడంతో స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మూడునెలల కిందట వేసిన బీటీ రోడ్డు మధ్యలో గుంతలేర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. బీటీ రోడ్డుకు రెండు వైపులా అంచుల్లో వెట్మిక్స్ లేచిపోయి రెండు, మూడు అడుగుల లోతు గుంతలేర్పడటంతో వాహనచోదకులు ముఖ్యంగా ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం ద్విచక్రవాహనచోదకులు పల్టీకొడుతూ గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్బీ అధికారులు వెంటనే ఈ రోడ్డు అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఈరూటు ప్రజలు కోరుతున్నారు.



వ్యవసాయ మార్కెట్ వద్ద గుంతలమయంగా ఉన్న రోడ్డు

విషజ్వరాలు రాకుండా చర్యలు

» మునిసిపల్ కమిషనర్ నరసింహ



మాట్లాడుతున్న కమిషనర్ నరసింహ

సత్తుపల్లి, జూలై14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు రాకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించి కార్యాచరణలో పెట్టినట్లు సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ కే.నరసింహ తెలిపారు. 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రజారోగ్యంపై సోమవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టీ.సీతారాం, గంగారం పీహెచ్సీ వైద్యాధికారి ఆర్.అవినాష్, మేనేజర్ శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ట్యాంకర్

» ఐదుగురికి తీవ్రగాయాలు



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కారేపల్లి, జూలై14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కామేపల్లి బస్టాండ్లో సోమవారం ఖమ్మం నుంచి ఇల్లెందు వెళ్తున్న ఆర్టీసీలో ప్రయాణికులు దిగుతున్న సమయంలో సిమెంట్ యాష్ ట్యాంకర్ బస్సును ఢీ కొట్టింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులకు గాయాలయ్యాయి. వారిలో ఐదుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలు గాయాలు కాగా వారిని స్థానికులు 108 ద్వారా ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కారేపల్లి ఎస్ఐ గోపి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

దరఖాస్తుల ఆహ్వానం

బోనకల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీలో తాత్కాలిక పద్ధతిలో పని చేసేందుకు గానూ అటెండర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి దామాల పుల్లయ్య తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల లోపు వయస్సు కలిగి, పదవ తరగతి ఉత్తీర్ణులైన మహిళలు ఈ నెల 18వ తేది లోపు కేజీబీవీలో తమ దరఖాస్తులను అందజేయాలని కోరారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం

» సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి



మార్నింగ్ వాక్లో ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు, జూలై14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్లు అన్నారు. కల్లూరు మునిసిపాలిటీలో సోమవారం మార్నింగ్ వాక్తో ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్నగర్, వేణుగోపాలస్వామి ఆలయ వీధి, వుల్లయ్యబంజర వీధి వైపున క్షేత్రస్థాయిలో వారు ఇంటి ఇంటికి వెళ్లి మహిళలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంబేద్కర్నగర్లో ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదని, వర్షాల కాలంలో మురుగు నీరు గృహాల మధ్య చేరుతుందని వాపోయారు. తాగునీటి సమస్యను, కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను ఓపిగా విన్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ తాము మార్నింగ్ వాక్తో గుర్తించిన ప్రధాన సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో చర్చించి నిధుల ఆవశ్యకతపై అంచనాలు తయారు చేయమని ఆదేశించటం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్ నాయకులు లక్కినేని కృష్ణ, తోటకూర శేషగిరిరావు, కొండపల్లి శ్రీమన్నారాయణ, పోట్రు అర్జునరావు, ఏనుగు సత్యంబాబు, తకేళ్లపాటి ప్రసాద్, లక్కినేని రమేష్, ప్రభాకరచౌదరి, ఎస్కె ఉస్మాన్ పాల్గొన్నారు.

కొత్త మేడేపల్లిని సందర్శించిన డీఈవో

ఏన్కూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం కొత్తమేడేపల్లి గొత్తికోయ గిరిజన వలస గ్రామాన్ని సోమవారం డీఈవో ఎస్.సత్యనారాయణ సందర్శించారు. గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 30మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్పై నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంఈవో రహీంబీ, ఉపాధ్యాయులు జయరాం పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో సత్యనారాయణ

వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కరించాలి

» వ్య.కా.సం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు

బోనకల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు ఆరోపించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ముగిసిన తరువాత పనులు లేక కూలీలు ఆంధ్రా ప్రాంతానికి వలస వెళ్తున్నారని వాపోయారు. గ్రామీణ ఉపాధి పథకం సమర్థవంతంగా అమలు చేయక పోవడం వలన కూలీల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా పెట్టుబడి దారుల ప్రయోజనాల కోసం పని చేస్తుందని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలన్నారు. రైతులకు ఉపయోగపడే చట్టాలను రద్దు చేస్తూ కార్పోరేట్ వర్గాలకు ఉపయోగ పడే విధంగా పాలక వర్గాలు తమ విధానాలను కొనసాగిస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి కిలారు సురేష్, నాయకులు బందం శ్రీనివాసరావు, వత్సవాయి జానకీరాములు, భద్రయ్య, సైదులు, సీతారాములు, ఉప్పర శ్రీను, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం

» ఆత్మ కమిటి చైర్మన్ కర్నాటీ రామకోటేశ్వరరావు

బోనకల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గూడు లేని పేదలకు ఇళ్లు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటీ రామకోటేశ్వరరావు తెలిపారు. బోనకల్ గ్రామంలో సోమవారం మందా రామలక్ష్మీ, అశోక్ దంపతులకు మంజూరైన ఇంటికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లు లేని వారిని గుర్తించి వారికి విడతల వారీగా ఇళ్లు ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, నాయకులు వట్టికొండ రామకృష్ణ, మారుపల్లి ప్రేమ్ కుమార్, జనప్రియ కుమార్, చింతకాయల సతీష్, యార్లగడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ రామకోటేశ్వరరావు

మట్టి తోలకాలను అడ్డుకోవాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

కారేపల్లి, జూలై14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మట్టి తోలకాలు చేస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మత్స్యకారులు ఆందోళన చేశారు. చెరువులలో, కుంటలలో పెద్ద గోతులను తవ్విమట్టిని అమ్ముకుంటున్నారని, చెరువులలో పెద్దగోతులు తవ్వడం వలన చెరువులలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు తెలిపారు. మట్టిని అక్రమంగా తోలుకోని అమ్ముకుంటున్న మాఫియాపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజావాణి తహసీల్దార్ రమేష్కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తురక నారాయణ,చందు, రాంబాబు, కోటయ్య, శ్రీను, హనుమంతు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాల సంక్షేమానికి కృషి



సహాయం అందిస్తున్న సహకార సంఘ సభ్యులు

సత్తుపల్లిరూరల్, జూలై14 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార కుటుంబాల సంక్షేమం కోసం సహకార సంఘం కట్టుబడి ఉందని బేతుపల్లి-గంగారం సహకార సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వూకే కన్నారావు, కాకా రామచంద్రరావులు అన్నారు. సహకారం సంఘంలో గత మూడేళ్ల మృతి చెందిన ఆరుగురు కుటుంబ సభ్యులకు రూ.9వేల చొప్పున రూ.54వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో వూకే చలమారావు, సోయం కోటేశ్వరరావు, సోయం వెంకటేశ్వరరావు, నవలం నాగరాజు, వూకే విజయరావు, వూకే సత్యనారాయణ, వాడే మల్లేశ్వరరావు, వాడే రాజా, సోరెం మహేశ్వరరావు, సోయం గోవిందరావు, వూకే శివకృష్ణ, కావేటి అప్పారావు, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై దాడికి నిరసనగా ధర్నా

ఏన్కూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తీన్మార్ మల్లన్నపై దాడిని నిరసిస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఏన్కూరు ప్రధాన కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా బీసీ సంఘం జిల్లా నాయకులు కొవ్వూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం కోసం తీన్మార్ మల్లన్న ప్రయత్నం చేస్తుంటే బీసీల ఐక్యతను తట్టుకోలేక తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు తన అనుచరులతో మల్లన్నపై దాడి చేయించిందని ఆరోపించారు. ఈ ధర్నాలో గిద్దగిరి సత్యనారాయణ, దేశాన్ని గణేష్, పాశం వెంకటేశ్వర్లు, కనిశెట్టి వెంకన్న, యాసా చందరరావు, ముదిగొండ నాగేశ్వరరావు, నారాయణదాస్ నరసింహారావు, కూరాకుల రమేస్, నరసింహారావు, అప్పారావు పాల్గొన్నారు.

'ప్రజావాణి'లో సమస్యల వెల్లువ



ప్రజావాణిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కల్లూరలోని రైతువేదికలో సోమవారం జరిగిన ప్రజావాణిలో పలు గ్రామాలకు చెందిన ప్రజానీకం పలు సమస్యలపై సత్తుపల్లి ఎమ్మెల్యే సమక్షంలో ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్తో కలిసి ఆయా సమస్యలపై అధికారులతో సమీక్షించారు. కల్లూరులో యూరియ కొరతను తీర్చాలని పలువురు రైతులు ఎమ్మెల్యేను కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులలో రాత్రిపూట వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు కోరారు. కల్లూరు మునిసిపాలిటీ పరిధిలో గల తాగునీటి పథకాలు పరిశుభ్రం చేస్తూ, ప్రయివైట్గా నడిపే మినరల్ వాటర్ ప్లాంట్లు తనిఖీ చేస్తూ వాటిపై చర్యలు తీసుకోనేలా అధికారులను ఆదేశించాలని న్యాయవాది పెద్దబోయన రామానరసింహారావు విజ్ఞప్తి చేశారు. నాణ్యమైన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని నారాయణపురం కాంగ్రెస్ నాయకుడు అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, సీడీపీవో నిర్మలజ్యోతి, పాల్గొన్నారు.

నానో యూరియా, డీఏపీ వాడకంతో ప్రయోజనాలు

» మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర

ఎర్రుపాలెం, జూలై14(ఆంధ్రజ్యోతి): పంట దిగుబడి పెంచి పర్యావరణాన్ని పరిరక్షించి వ్యవసాయంలో నానో సాంకేతికతతో విప్లవాత్మక శక్తిగా నానో యూరియా పనిచేస్తుందని, ఇది రైతులకు సాంప్రదాయ యూరియాకి ప్రత్యామ్నాయంగా సహాయ పడుతుందని మధిర వ్యవసాయ సహాయ సంచాలకుడు స్వర్ణ విజయచంద్ర అన్నారు. మండలంలోని ఎర్రుపాలెం, తక్కెళ్లపాడు, బనిగండ్లపాడు గ్రామాల్లో సోమవారం పర్యటించి పీఏసీఎస్ మరియు పురుగుమదు దుకాణాలను తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల రైతులతో మాట్లాడి నానోయూరియా పై అవగాహన కల్పించి, దాని వాడకంపై పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఏవో బోయినపల్లి సాయిశివ, ఏఈవోలు బాలకృష్ణ, సింధూర్ పాల్గొన్నారు.



ఎర్రుపాలెంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ స్వర్ణ విజయచంద్ర



సిరిపురంలో నానోయూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏవో

వైరా, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నానోయూరియా, డీఏపీని రైతులు రైతులు విరివిగా వాడుకోవాలని వైరా మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజూఖాన్ సూచించారు. మండలంలోని సిరిపురం, తాటిపూడి గ్రామాల్లో పత్తి పంటలో నానోయూరియా, డీఏపీ వాడకంపై సోమవారం క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. యూరియా, డీఏపీని ఎరువుకు బదులు నానో(ద్రవ)రూపంలో వాడుకోవాలని సూచించారు. యూరియా ఘనరూపంలో వాడటం వలన నేల, వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని అదే నానోయూరియా, డీఏపీ వలన మొక్క నేరుగా నత్రజనిని తీసుకోవడం వలన నేల, వాతావరణ కాలుష్యం ఉండదని అందువలన ఈవిధానాన్నే అనుసరించాలని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పూసలపాడు సొసైటీ అధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు, ఏఈవోలు కీర్తి, రాజేష్, రైతులు బండి గోపాలకృష్ణ, రాంప్రసాద్, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, మందడపు కృష్ణార్జున్రావు, గొల్లమందల నగేష్, మందడపు శరబయ్య, కొంకా నర్సింహారావు, చిత్తారు రామారావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వైరా, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వైరా మండల ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సోమవారం వైరాలోని ఇరువురు బాధిత ఆర్యవైశ్య కుటుంబాలకు రూ.1.35లక్షల ఆర్థిక సహాయాన్ని ఆసంఘం రాష్ట్ర నాయకుడు వనమా విశ్వేశ్వరరావు సోమవారం అందజేశారు. సంఘం మండల అధ్యక్షుడు మిట్టపల్లి కిరణ్కుమార్ అధ్యక్షతన వాసవీ కల్యాణమండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నూకల శ్రీనివాసరావు, నాయకులు నూకల ప్రసాద్, మిట్టపల్లి సత్యంబాబు, కేవీ.సుబ్బారావు, వజినేపల్లి చక్రవర్తి, గజ్జల కృష్ణమూర్తి, కొల్లా రాంబాబు, దారా వెంకటకృష్ణ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న విశ్వేశ్వరరావు



తల్లాడలో...

హోంగార్డు కుటుంబానికి ...

తల్లాడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిల్లుపాడు గ్రామానికి చెందిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోంగార్డు రఘుపతి కుటుంబానికి తోటి హోంగార్డులు రూ.46వేలు ఆర్థికసాయం అందించారు. సోమవారం రఘుపతి కుటుంబసభ్యులను పరామర్శించిన అనంతరం ఆర్థికసాయాన్ని వారి కుటుంబసభ్యులకు అందించారు.

గండగలపాడుకు వాటర్ట్యాంకుతో తాగునీటి సరఫరా

వైరా, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పదోవార్డులోని గండగలపాడు ప్రజలకు సోమవారం ట్యాంకర్ ద్వారా మంచి నీటిని సరఫరా చేశారు. వైరా మునిసిపాలిటీలోని పదోవార్డు గండగలపాడు, 15వ వార్డు దిద్దుపూడికి గత మూడురోజుల నుంచి మిషన్ భగీరథ మంచినీటి సరఫరా నిల్చిపోయింది. మిషన్ భగీరథ పైపులైన్లు పగిలిపోయి లీకులవుతుండటంతో నీటి సరఫరా బంద్ అయింది. గండగలపాడులో రెండు ట్రాన్స్ఫార్మర్ల నిర్మాణ సమయంలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయింది. ఈ పైపులైన్ మరమ్మతులకు ట్రాన్స్కో అధికారులు ఎక్స్కవేటర్ను ఏర్పాటుచేయాలని మిషన్ భగీరథ సిబ్బంది కోరినప్పటికీ సకాలంలో వారు స్పందించలేదు. దాంతో తాగునీటి కోసం గండగలపాడు ప్రజలు ఇబ్బంది పడుతుండటంతో మునిసిపాలిటీ అధికారులు ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. ఇప్పటికైనా వెంటనే ట్రాన్స్కో, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో పైపులైన్కు మరమ్మతులు చేసి మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆగ్రామస్థులు కోరుతున్నారు. అలాగే దిద్దుపూడిలో పైపులైన్కు కూడా మరమ్మతులు చేసి వెంటనే తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.



ట్యాంకర్లోని నీటిని పట్టుకుంటున్న ప్రజలు

వేతనాల కోసం ఆస్పత్రి కార్మికుల ధర్నా

కల్లూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ప్రాంతీయ వైద్యశాఖ ఎదుట సోమవారం కార్మికులు వేతనాల కోసం ధర్నా చేశారు. గత మూడు నెలల నుంచి వేతనాలు అందక తాము తీవ్ర ఇబ్బందులు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు మాట్లాడారు. వైద్యాధికారులకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ కార్యదర్శి దామాల దయాకర్ కార్మికులు నాగమణి, వంశీ, కోటేశ్వరి, రాంజాన్బీ, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు